పుష్కరాల్లో.. పుష్కల ఆదాయం..

- ముక్తీశ్వర ఆలయానికి ఐదురోజుల్లో రూ.57.04 లక్షలు రాక

7



ముక్తీశ్వరాలయంలో భక్తుల క్యూ

నత్తే నయం..

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణపనుల్లో జాప్యం

- మొదటి విడతలో 9 గ్రామాల ఎంపిక
- జిల్లాలో 541 మంది అర్హులుగా గుర్తింపు
- ముగ్గుదశలోనే నిలిచిన 390 గృహాలు



తాడ్వాయి మండలంలో అంకంపల్లి గ్రామంలో బెస్‌మెంట్ లెవల్ పనులు జరిగిన ఇళ్లు

ములుగు, మే 19(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం పతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇంటి నిర్మాణ పనులు ములుగు జిల్లాలో నత్తనడకన సాగుతున్నాయి. పలువురు లబ్ధిదారులు ఇంటిని చకచకా నిర్మించుకుంటుంటే ఎక్కువలో ఎక్కువ మంది ముగ్గు దశలోనే ఆగిపోయారు. పునాదులు తీసి బేస్‌మెంట్ లెవల్‌కు నిర్మాణం చేపట్టాలన్నా రూ. లక్ష వరకు ఖర్చు అవుతుందని, అంత డబ్బు మా దగ్గర లేవని లబ్ధిదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం ఏదోలా సహకరించి ఇంటిని నిర్మించి ఇచ్చి పుణ్యం కట్టుకోవాలని వేడుకుంటున్నారు.

మొదటి విడుతలో 9 గ్రామాల ఎంపిక

ఇందిరమ్మ ఇండ్ల పంపిణీ పైలట్ ప్రాజెక్టులో భాగంగా ములుగు జిల్లాలో మండలానికి ఒక గ్రామాన్ని ఎంపిక చేశారు. ములుగు మండలంలో జీవం తారావుపల్లి, వెంకటాపూర్‌లో లింగాపూర్, ఏటూరునాగారంలో ముల్లకట్ట, తాడ్వాయిలో అంకంపల్లి, మంగపేటలో పూరేడుపల్లి, గోవిందరావుపేటలో రాఘవపట్నం, వాజేడులో టేకులగూడెం, వెంకటాపురంలో రాచపల్లి, కన్నాయిగూడెంలో కంతనపల్లి గ్రామాలను పైలట్ ప్రాజెక్ట్ గ్రామాలుగా ఎంపిక చేశారు.

జిల్లాలో 541 మంది అర్హుల గుర్తింపు

ఇందిరమ్మ ఇండ్ల కోసం జిల్లాలోని 9 గ్రామాల నుంచి 733 ఇండ్లకు కలెక్టర్ అప్రూవల్ దొరికింది. అయితే రెవెన్యూ అధికారులు సర్వే నిర్వహించి 541 మంది లబ్ధిదారులను అర్హులుగా ఎంపిక చేశారు. ఇందులో జీవంతరావుపల్లిలో 29 మంది, ముల్లకట్టలో 56 మంది, రాఘవపేటలో 77 మంది, కంతనపల్లిలో 89 మంది, అంకంపల్లిలో 92 మంది, పూరేడుపల్లిలో 49 మంది, టేకులగూడెంలో 68 మంది, రాచపల్లిలో 63 మంది లింగాపూర్‌లో 18 మందికి ఇండ్లను మంజూరు చేశారు.

ముగ్గుదశలోనే నిలిచిన 390 ఇళ్లు

పేదోడి సొంతింటి కళను నెరవేర్చేందుకు కాంగ్రెస్ ప్రభుత్వ ఇందిరమ్మ ఇంటి పథకాన్ని ప్రవేశపెట్టింది. ఈ క్రమంలో పైలెట్ ప్రాజెక్టులో భాగంగా జిల్లా నుంచి 9 గ్రామాలను ఎంపిక చేసి 541 మంది లబ్ధిదారులకు ఇండ్లను మంజూరు చేసింది. మే 6 వరకు 151 మంది మాత్రమే బేస్‌మెంట్ లెవల్ వరకు పనులు చేయించుకున్నారు. మిగితా 390 మంది లబ్ధిదారులు ముగ్గు పోయడంతోనే సరిపెట్టుకున్నారు. అయితే పునాదులు తీయించుకోవాలన్నా, బెస్‌మెంట్ లెవల్ వరకు పనులు చేపట్టాలన్నా సుమారు రూ. లక్ష వరకు ఖర్చు వస్తుందని, అంత సొమ్ము తమదగ్గరెక్కడుందని పలువురు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. అయితే ప్రభుత్వం ఇంటి పనులు మొదటు పెట్టాకే విడుతల వారీగా డబ్బులు ఇస్తామని చెప్పింది. దీంతో డబ్బులు లేని 390 మంది లబ్ధిదారులు ఇంటి నిర్మాణ పనులు మొదలు పెట్టుకోలేదు. మహిళా సంఘాల ద్వారనో, బ్యాంకుల ద్వారనో లోన్ ఇప్పిస్తే ఇంటి పనులు చేకుంటామని కొందరు చెబుతున్నారు. ఇంటి నిర్మాణ పనులు కాంట్రాక్టర్‌కు అప్పగించి వారికే ప్రభుత్వం డబ్బులు చెల్లిస్తే తమకు ఈ బాధ తప్పుతుందని మరికొందరు అంటున్నారు.

గ్రామాల్లో బేస్‌మెంట్ లెవల్ అయిన ఇళ్ల సంఖ్య

గ్రామం	లబ్ధిదారులు	పనులు ప్రారంభమైనవి	కానివి
ముల్లకట్ట	56	34	22
రాఘవపట్నం	77	21	56
కంతనపల్లి	89	7	82
పూరేడుపల్లి	49	26	23
జీవంతరావుపల్లి	29	6	23
అకంపల్లి	92	27	65
లింగాపూర్	18	5	13
రాచపల్లి	63	11	52
టేకులగూడెం	68	14	54



ప్రత్యేక పూజలు చేస్తున్న కేంద్ర మంత్రి బండి సంజయ్ దంపతులు



పుష్కరిణికి నవరత్న హారతి ఇస్తున్న కాశీ పండితులు

పుష్కర స్నానం.. పుణ్యఫలం

కాళేశ్వర త్రివేణి సంగమానికి కొనసాగుతున్న భక్తుల రద్దీ

- ఐదో రోజున స్వల్ప తగ్గుదల.. 60వేల మందికిపైగా వచ్చినట్టు అంచనా
- పుష్కరస్నానం ఆచరించిన కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ దంపతులు
- త్రయంబకేశ్వర్ స్వామీజీ సహా పలువురు వీఐపీల రాక
- ట్రాఫిక్ సమస్యకు చెక్‌పెడుతూ పోలీసుల పకడ్బందీ చర్యలు

7



త్రివేణి సంగమంలో పుష్కర స్నానాలు ఆచరిస్తున్న భక్తులు

ప్రజావాణి దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలి

అదనపు కలెక్టర్ సంపత్‌రావు



ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్న అదనపు కలెక్టర్

ములుగు కలెక్టరేట్, మే 19 (ఆంధ్రజ్యోతి): ప్రజావాణి కార్యక్రమంలో ప్రజలు అందజేసే దరఖాస్తుల ను త్వరితగతిన పరిష్కరించాలని అదనపు కలెక్టర్ (సానిక సంస్థలు) సంపత్‌రావు సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశమందిరంలో జరిగిన ప్రజావాణి కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రజల నుంచి 37 దరఖాస్తులను స్వీకరించారు. ఈసందర్భంగా సంపత్‌రావు మాట్లాడుతూ వివిధ సమస్యల పరిష్కారం కోరుతూ ప్రజలు ప్రజావాణిని ఆశ్రయిస్తున్నారని, వారి దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలన్నారు. ప్రజావాణి పోర్టల్‌లో పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను కూడా వెంటవెంటనే పరిష్కరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ కార్పొరేషన్ అధికారి తుల రవి, సివిల్‌సప్లయ్ అధికారి ఫైజల్ హుస్సేన్, సివిల్ సప్లయ్ మేనేజర్ రాంపతి, డీఎస్‌సీవో లక్ష్మణ్‌నాయక్, డీసీవో సర్దార్‌సింగ్, డీడబ్ల్యూవో శిరీష, జిల్లా పంచాయతీ అధికారి దేవరాజ్, విద్యుత్‌శాఖ అధికారి నాగేశ్వర్‌రావు, లీడ్ బ్యాంకు మేనేజర్ జయప్రకాశ్, వివిధశాఖల జిల్లాస్థాయి అధికారులు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

సమస్యలను సత్వరమే పరిష్కరించాలి

గిరిజన దర్బార్‌లో ఐటీడీఏ పీవో చిత్రమిశ్రా



గిరిజన దర్బార్‌లో పీవోకు వినతులు సమర్పిస్తున్న గిరిజనులు

ఏటూరునాగారం రూరల్, మే 19 (ఆంధ్రజ్యోతి): గిరిజనులు తమ దృష్టికి తీసుకొస్తున్న సమస్యలను త్వరితగతిన పరిష్కరించి వారికి మెరుగైన సేవలందించేందుకు కృషి చేయాలని ఐటీడీఏ పీవో చిత్రమిశ్రా సెక్టోరియల్ అధికారులకు సూచించారు. సోమవారం మండలకేంద్రంలోని ఐటీడీఏ కార్యాలయంలో గిరిజన దర్బార్ జరగగా ఆమె పాల్గొని గిరిజనుల నుంచి వినతులు స్వీకరించారు. గిరిజన దర్బార్‌లో మొత్తం 18మంది గిరిజనులు తమ సమస్యలను పీవో దృష్టికి తీసుకెళ్లారు. వెంకటాపురం, ఏటూరునాగారం, మహబూబాబాద్, గోవిందరావుపేట, ములుగు, వాజేడు, తదితర మండలాల నుంచి గిరిజనులు ఉద్యోగ అవకాశం, పెండింగ్ బిల్లుల మంజూరు, జ్యూట్ బ్యాగుల తయారీ శిక్షణ, పలు విషయాలపై వినతులు సమర్పించారు. ఉపాధి కల్పించాలని కొందరు దరఖాస్తు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఐటీడీఏ డీడీ పోచం, మేనేజర్ శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా దుర్గాదేవి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం

- హాజరైన ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు



పూజా కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే, జీఎం

కృష్ణకాలనీ, మే 19 (ఆంధ్రజ్యోతి): భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని సింగరేణి రెస్క్యూ స్టేషన్‌లో నూతనంగా నిర్మించిన ఆలయంలో దుర్గాదేవి విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవాన్ని సోమవారం వైభవంగా నిర్వహించారు. భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు, సింగరేణి జనరల్ మేనేజర్ ఏనుగు రాజేశ్వర్ రెడ్డిలు ముఖ్య అతిథులుగా హాజరై ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రెస్క్యూ స్టేషన్‌లో అందరు దర్శించుకునేందుకు వీలుగా అమ్మవారి గుడి నిర్మించడం చాలా సంతోషకరమన్నారు. రాబోయే రోజుల్లో ఆలయం అన్ని రంగాల్లో అభివృద్ధిచెందాలని ఆకాంక్షించారు. కాగా, సింగరేణి డైరెక్టర్ పీపీ వెంకటేశ్వర్లు, మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణా రెడ్డిలు హాజరై అమ్మవారికి పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఓటూ జీఎం కవీంద్ర, పర్సనల్ మేనేజర్ కావూరి మారుతి, రెస్క్యూ స్టేషన్ ఇన్‌ఛార్జీ రాజేందర్‌రెడ్డి, ఉద్యోగులు, యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

మేమింతే.. మారమంతే..!

- పుష్కర విధుల్లోని కొందరు పోలీసుల దురుసు ప్రవర్తన
- చర్చనీయాంశమవుతున్న ఖాకీల తీరు



ఓ పోలీసు అధికారి తీరుతో నిరసన వ్యక్తం చేస్తున్న స్థానికులు

కాళేశ్వరం, మే 19(ఆంధ్రజ్యోతి) : సరస్వతీ పుష్కర విధుల్లో ఉన్న కొందరు పోలీసుల తీరు చర్చనీయాంశమవుతోంది. భక్తులతో పాటు స్థానికుల పట్ల రోజుకో చోట ఇష్టానుసారంగా ప్రవర్తించడం పరిపాటిగా మారింది. ఒకరిద్దరు పోలీసుల తీరుతో ఆ శాఖకే చెడ్డపేరు తెస్తోందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. నిత్యం ఏదో ఒక వివాదం జరుగుతుం డటం, వాటి గురించి తెలిసి కూడా ఉన్నతాధికారులు దృష్టిసారించ కపోవడం పట్ల విమర్శలు వెల్లువెత్తున్నాయి. సరస్వతీ పుష్కరాలు ప్రారంభమైన నాటి నుంచి పలువురు పోలీసులు వ్యవహరిస్తున్న తీరు వివాదస్పదమవుతూనే ఉంది. మొదటి మూడు రోజులు శ్రీకాళేశ్వరముక్తీశ్వరాలయంతో పాటు ఆల య పరిసరాల్లో విధుల్లో ఉన్న పోలీసులు ఇష్టానుసారంగా వ్యవహ రించగా వారి తీరుపై మీడియాలో కథనాలు వచ్చాయి. ఎట్టకేలకు స్పందించిన అధికారులు వారిని మరోచోటకు పంపించి వారి స్థానం లో కొత్తవారిని ఏర్పాటు చేశారు. అక్కడ గొడవ సద్దుమనిగిం దనేలోపే మళ్లీ మరో చోట ఇలా గొడవకు దారితీయడం చర్చనీ యాంశమైంది.

స్థానికుడి పట్ల అనుచితం.. నిరసన వ్యక్తం

కాళేశ్వరం గ్రామానికి చెందిన ఓ భక్తుడి పట్ల సోమవారం ఓ పోలీసు అధికారి వ్యవహరించిన తీరు చర్చనీయాంశమైంది. ప్రధాన ఘట్ నుంచి సరస్వతీ ఘాట్‌కు వెళ్లే రోడ్డులోకి బైకును అడ్డుకున్న సదరు అధికారి అతడిని బూతులు తిడుతూ ఇబ్బందులకు గురి చేశాడని స్థానికులు తెలిపారు. అతడి పక్కనే ఉన్న మహిళ పట్ల కూడ సదరు అధికారి దురుసుగా వ్యవహరించడంతో ఇదేంటని ప్రశ్నించామన్నారు. దీంతో కోపోద్రిక్తుడైన సదరు అధికారి బైక్ తాళం తీసుకుని 'ఏ చేసుకుంటారో చేసుకోండి' అని అనడంతో సదరు వ్యక్తి స్థానికులతో కలిసి నిరసనకు దిగాడు. స్థానిక పోలీసు అధికారి వచ్చి చెప్పినప్పటికీ తాళం ఇవ్వకపోవడం గమనార్హం. చివరకు ఆమార్గంలో వెళ్తున్న ఓ ఎమ్మెల్యే గమనించి తాళం ఇచ్చేయమని చెప్పడంతో ఆ అధికారి శాంతించి తాళం ఇచ్చినట్లు స్థానికులు తెలిపారు. జర్నలిస్టులు, ఆలయ అర్చకులు, స్థానికులతో పాటు భక్తుల పట్ల పోలీసులు వ్యవహరిస్తున్న తీరు తరచూ చర్చనీయాంశమవుతోంది.

తాగునీటి కేంద్రాలను పరిశీలించిన డీపీవో

కాళేశ్వరం, మే19(ఆంధ్రజ్యోతి): సరస్వతీ పుష్కరాల సందర్భంగా కాళేశ్వరంలోని వివిధ ప్రాంతాలలో ఏర్పాటు చేసిన తాగునీటి కేంద్రాలను జిల్లా పంచాయతీ అధికారి శ్రీనివాస్ సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా పారిశుధ్య నిర్వహణను పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. మరుగుదొడ్ల నిర్వహణను ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ శుభ్రంగా ఉంచాలని సిబ్బందిని కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పుష్కరాల్లో పారిశుధ్య నిర్వహణను తమ సిబ్బంది పకడ్బందీగా నిర్వహిస్తున్నారని అన్నారు.

వాహన యజమానులు నిబంధనలు పాటించాల్సిందే

- ఆర్టీవో శ్రీనివాస్

ములుగు కలెక్టరేట్, మే 19 (ఆంధ్రజ్యోతి): వాహన యజమానులు నిబంధనలను కచ్చితంగా పాటించాలని, తనిఖీల సమయంలో ఉల్లంఘించినట్లు తేలితే చర్యలు కఠినంగా ఉంటాయని ములుగు ఆర్టీవో శ్రీనివాస్ అన్నారు. వాహనాల తనిఖీ స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా సోమవారం జిల్లాలో పలుచోట్ల వాహన తనిఖీలు చేపట్టారు. గడువులోగా ప్రతీ వాహన యజమాని త్రైమాసిక పన్ను చెల్లించాలని, లేనిపక్షంలో 200శాతం జరిమానా విధించడం జరుగుతుందని అన్నారు. ఒక్కోసారి వాహనాన్ని కూడా సీజ్ చేస్తామన్నారు. ఆర్‌సీ, ఫిట్‌నెస్, పొల్యూషన్, ఇన్సూరెన్స్, డ్రైవింగ్ లైసెన్స్, రోడ్డుటాక్స్, ద్విచక్రవాహనదారులు హెల్మెట్ కలిగి ఉండాలని తెలిపారు. 15ఏళ్లకాలం ముగిసిన మోటార్ సైకిళ్లు, కార్లు, తదితర వాహనాలకు ఆర్టీవో కార్యాలయంలో రెన్యూవల్ చేయించుకోవాలని, తద్వారా అదనంగా ఐదునెలల కాలం పెరుగుతుందని అన్నారు.



వరంగల్ జిల్లా జట్టును అభినందిస్తున్న అజీజ్‌ఖాన్

నెట్‌బాల్ పోటీల్లో వరంగల్ జట్టు సత్తా

రాష్ట్ర స్థాయిలో తృతీయ స్థానంలో నిలిచి కాంస్యం కైవసం

వరంగల్ స్పోర్ట్స్, మే 19(ఆంధ్రజ్యోతి): ఇటీవల జనగామ జిల్లా కేంద్రంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి అండర్-16 మిక్సిడ్ నెట్‌బాల్ చాంపియన్‌షిప్ పోటీల్లో వరంగల్ జిల్లా జట్టు తృతీయస్థానంలో నిలిచి కాంస్య పతకం సాధించింది. ఈ మేరకు సోమవారం హనుమకొండ జేఎన్‌ఎస్‌లోని నెట్‌బాల్ కోర్టులో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వరంగల్ జిల్లా ఒలంపిక్ అసోసియేషన్ అధ్యక్షుడు మహ్మద్ అజీజ్‌ఖాన్ పాల్గొని వరంగల్ జిల్లా జట్టు సభ్యులను అభినందించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రస్థాయిలో నిర్వహించిన నెట్‌బాల్ పోటీల్లో రాష్ట్రవ్యాప్తంగా 33జిల్లాల నుంచి క్రీడాకారులు పాల్గొనగా, ఇందులో వరంగల్ జిల్లా జట్టు తృతీయ స్థానంలో రాణించడం సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో డీవైఎస్‌వో అశోక్‌కుమార్, నెట్‌బాల్ అసోసియేషన్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు కందుల సృజన్‌కాంత్, రాష్ట్ర ఉపాధ్యక్షురాలు లిల్లీ ఫోరెన్స్ తదితరులు పాల్గొన్నారు.

మ్యాథ్స్‌లో మంగమ్మకు డాక్టరేట్



వరంగల్ ఎడ్యుకేషన్, మే 19 (ఆంధ్రజ్యోతి): హుజూరాబాద్‌లోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మ్యాథ్స్ అధ్యాపకురాలిగా పనిచేస్తున్న ఇప్ప మంగమ్మకు హైదరాబాద్‌లోని అనురాగ్ యూనివర్సిటీ డీన్ ప్రొఫెసర్ ఎం.ముత్తారెడ్డి సోమవారం మ్యాథ్స్‌లో పీహెచ్‌డీ పట్టాను అందజేశారు. ప్రొఫెసర్ వై.ధర్మేందర్‌రెడ్డి పర్యవేక్షణలో 'న్యూమరికల్ సొల్యూషన్స్ ఆఫ్ ఎంహెచ్‌డీ హీట్ అండ్ మాస్ ట్రాన్స్‌ఫర్ నానో ఫ్లూయిడ్ ఫ్లో ప్రాబ్లమ్ ఓవర్ ఏ ష్రింకింగ్ స్ట్రెచింగ్ సర్ఫేస్' అనే అంశంపై సమర్పించిన పరిశోధన గ్రంథానికి ఆమెకు పీహెచ్‌డీ డిగ్రీని ప్రదానం చేసింది.

దీప్తికి గీతం యూనివర్సిటీ డాక్టరేట్



వరంగల్‌కు చెందిన ఆర్.దీప్తికి విశాఖపట్టణంలోని గీతం యూనివర్సిటీ ఫార్మసీలో పీహెచ్‌డీ డిగ్రీని సోమవారం ప్రకటించింది. ప్రొఫెసర్ జి.సుహాసిన్ పర్యవేక్షణలో 'అడెనిన్ ఇన్‌డ్యూస్డ్ క్రానిక్ కిడ్నీ డామేజ్ అండ్ కార్డియోవాస్క్యులర్ ఆల్టరేషన్స్ టార్గెటింగ్ టీజీఎఫ్ బీటా-1 అండ్ కాస్పేస్-3' అనే అంశంపై సమర్పించిన పరిశోధన గ్రంథానికి ఆమెకు డాక్టరేట్‌ను ప్రకటించినట్లు వర్సిటీ రిజిస్ట్రార్ ప్రకటించారు. కాగా దీప్తి ప్రస్తుతం ఓగ్లాపూర్ కేర్ కాలేజ్ ఆఫ్ ఫార్మసీలో అసోసియేట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్నారు.

కమిషనరేట్‌లో పలువురు ఏసీపీల బదిలీ

వరంగల్ క్రైం, మే 19 (ఆంధ్రజ్యోతి): వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో వివిధ డివిజన్‌లలో విధులు నిర్వహిస్తున్న పలువురు ఏసీపీలను బదిలీ చేస్తూ రాష్ట డీజీపీ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. హనుమకొండ ఏసీపీ దేవేందర్‌రెడ్డిని హైదరాబాద్ డీజీ కార్యాలయానికి బదిలీ చేశారు, ఆయన స్థానంలో రాచకొండ షీ టీం ఏసీపీగా పనిచేస్తున్న పి.నర్సింహరావును నియమించారు. మామునూరు ఏసీపీ బి.తిరుపతిని డీజీ కార్యాలయానికి ట్రాన్స్‌ఫర్ చేయగా, ఆయన స్థానంలో ఖమ్మం ఎస్‌బీఐ అండ్ సెక్యూరిటీ ఏసీపీ ఎన్.వెంకటేష్‌ను నియమించారు. సీఐడీ డీఎస్పీగా విధులు నిర్వహిస్తున్న పి.సదయ్యను వరంగల్ సీసీఎస్ ఏసీపీగా నియమిస్తూ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. కాగా, రెండు రోజుల కిందటే క్రైం ఏసీపీగా వి.కిరణ్‌కుమార్ బాధ్యతలు స్వీకరించడం గమనార్హం.

మన బంగారం మంచిదేనా?

- తూనికలు, కొలతల శాఖాధికారులకు తనిఖీ అధికారం
- సీజీఎక్స్ 101 యంత్రం లేక ఇబ్బందులు
- నష్టపోతున్న పసిడి కొనుగోలు దారులు
- నగరంలో నాలుగు హాల్‌మార్కింగ్ సెంటర్ల మూత
- నేడు ప్రపంచ తూనికలు, కొలతల దినోత్సవం

హనుమకొండ, మే 19 (ఆంధ్రజ్యోతి): మార్కెట్‌లో అమ్మకమయ్యే వివిధ వస్తువుల బరువు, ధరల విషయంలో వ్యాపారులు మోసాలకు పాల్పడకుండా తనిఖీలు చేసే తూనికలు, కొలతల అధికారులకు బంగారం స్వచ్ఛతను తనఖీ చేసే అధికారం కూడా ఉంది. కానీ వీరు దీనిని వినియోగించుకోలేకపోతున్నారు. ఇందుకు కారణం బంగారం, వెండి స్వచ్ఛతను నిర్ధారించే సీజీఎక్స్ 101 పరికరం అందుబాటులో లేకపోవడమే. ఈ యంత్రం లేకపోవడం వల్ల అధికారులు బంగారం, వెండి దుకాణాల జోలికి వెళ్లడంలేదు. దీంతో వ్యాపారులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. ఫలితంగా కొనుగోలుదారులు తీవ్రంగా నష్టపోతున్నారు. నేడు ప్రపంచ తూనికలు, కొలతల దినోత్సవం సందర్భంగా ఉమ్మడి వరంగల్ జిల్లాలో బంగారం, వెండి నగల స్వచ్ఛతలో జరుగుతున్న మోసాలు, అధికారం ఉండి ఏమీ చేయలేని తూనికల కొలతల అధికారులపై ప్రత్యేక కథనం.



బంగారం స్వచ్ఛతను కొలిచే సీజీఎక్స్ 101 యంత్రం

సీజీఎక్స్ 101 యంత్రం ఏర్పాటు ఎప్పుడు?

బంగారం స్వచ్ఛత, బరువును పరీక్షించే అధికారం తూనికలు కొలతల శాఖకు కూడా ఉన్నది. బహిరంగ మార్కెట్‌లో ఎలక్ట్రానిక్ కాంటాలు, నిత్యావసర వస్తువుల బరువు, రేట్లు తదితర వాటిని తనఖీచేసే తూనికలు కొలతల శాఖ అధికారులకు 2011 రూల్ 9 (4) ప్రకారం బంగారం, వెండి ఆభరణాల నాణ్యతను పరీక్షించే అధికారం కూడా ఉన్నది. వారు కూడా ఎప్పటికప్పుడు వెండి, బంగారం నగల దుకాణాలతో ఆకస్మిక తనిఖీలు జరిపి అక్కడ విక్రయిస్తున్న బంగారం స్వచ్ఛత, బరువును పరీక్షించి లోపాలు ఉన్నట్లయితే కేసులు నమోదు చేయవచ్చు. కానీ అధికారులు వాటికి జోలికి వెళ్లడం లేదు. ఇందుకు కారణం బంగారం, వెండి స్వచ్ఛతను కొలిచే పరికరం లేకపోవడమే.

ప్రతీ జిల్లాలో ఏర్పాటు చేయాలి

వాస్తవంగా ప్రతీ జిల్లాలో తూనికలు కొలతల శాఖ ఆధ్వర్యంలో ఇలాంటియంత్రాన్ని తప్పనిసరిగా ఏర్పాటు చేయాల్సి ఉంది. ఈ యంత్రం పేరు ఎక్స్ రే ఫ్లోరోసెన్సెస్ స్పెక్ట్రో మీటర్ కాంటెక్ సీజీఎక్స్ 101. ఈ యంత్రం సహాయంతో కేవలం 30 సెకన్లలో బంగారం స్వచ్ఛతను తెలుసుకోవచ్చు. బంగారం ఆభరణాన్ని యంత్రంపై ఉంచితే చాలు. యంత్రంలోని ఎక్స్‌రే కిరణాలు ఆభరణంలోకి దూసుకువెళ్లి తిరిగి రిఫ్లెక్స్ అవుతాయి. యంత్రానికి అనుసంధానం చేసిన సాఫ్ట్‌వేర్ ఆధారంగా క్షణాల్లో ఆ ఆభరణం ఎన్ని క్యారెట్లు ఉంది? అందులో కలిసిన కాపర్, జింకు, సిల్వర్, నికెల్ తదితర లోహాల శాతాన్ని చెప్పేస్తుంది. ఈ యంత్రంతో బంగారంలో నాణ్యత, స్వచ్ఛతను సులువుగా తెలుసుకోవడంతో పాటు మోసం జరిగితే సదరు వ్యాపారిపై కొనుగోలుదారులు ఫిర్యాదు చేసే అవకాశం ఉంది. ఈ యంత్రం ఖరీదు సుమారు రూ.15లక్షల నుంచి రూ.20లక్షల వరకు ఉంటుంది. ఈ యంత్రం లేకపోవడంవల్ల తమకు అధికారం ఉన్నప్పటికీ తూనికలు, కొలతల శాఖ అధికారులు బంగారుం, వెండి దుకాణాల్లో తనఖీలు చేయలేకపోతున్నారు. ఖరీదైనదవి అయినందువల్ల బంగారం, వెండి వస్తువుల శాంపిళ్లను సేకరించడం కష్టం. ఒక వేళ సేకరించినా వాటిని పరీక్ష కోసం హైదరాబాద్‌లోని తూనికలు కొలతల ప్రధాన కార్యాలయానికి పంపి రిపోర్టులు వచ్చే వరకు ఎదురుచూడాలి. ఈ తతంగం అంతా కష్టంతో కూడుకున్నది కావడంతో అధికారులు వాటి జోలికి వెళ్లడం లేదు. బీఐఎస్ అధికారులే ప్రస్తుతం ఈ బాధ్యతను నిర్వహిస్తున్నారు.

హాల్‌మార్క్ సెంటర్ల మూత

నగరంలో 5 హాల్‌మార్క్ సెంటర్లు ఉండగా వీటిలో నాలిగింటిని బ్యూరో ఆఫ్ ఇండియాన్ స్టాండర్డ్స్ (బీఐఎస్) అధికారులు మూసివేశారు. వాటి లైసెన్సులను రద్దు చేశారు. ఈ నాలిగింటిలో మూడు వరంగల్ విశ్వకర్మ వీధిలోనివి కాగా, ఒకటి హనుమకొండ టైలర్ స్ట్రీట్‌లోది. బంగారం షాపుల్లో కొన్న నగలు నిర్దేశిత ప్రమాణాల మేరకు స్వచ్ఛతతో ఉన్నాయా? లేవా అనేది నిర్ధారించడానికి కొనుగోలుదారులు తాము కొన్న నగలను ఈ హాల్ మార్కింగ్ సెంటర్లకు వెళ్లి పరీక్షలు చేయించుకోవచ్చు. ఇటీవల బీఐఎస్ అధికారులు హనుమకొండ, వరంగల్ జిల్లాల్లో బంగారం శాంపిల్స్‌ను సేకరించిన క్రమంలో చాలా వరకు అవి నిర్ధారిత ప్రమాణాల మేరకు స్వచ్ఛత లేదన్న విషయం బయటపడింది. దీనితో నాలుగు హాల్ మార్క్ సెంటర్ల లైసెన్సులను రద్దు చేసింది. వాటిని మూసివేయించింది.

బంగారం, వెండిలో మోసాలు

సాంబరాజు చక్రపాణి, జాతీయ ప్రధాన కార్యదర్శి, వినియోగదారులదారుల మండలి



బంగారం, వెండి స్వచ్ఛతను తనఖీ చేసేందుకు తూనికలు, కొలతల అధికారులు వారికున్న అధికారాన్ని వినియోగించుకునేందుకు వీలుగా బంగారం స్వచ్ఛతను కొలిచే యంత్రాలను వెంటనే అన్ని జిల్లా కేంద్రాల్లో ఏర్పాటు చేయాలి. ఇందు వల్ల బంగారం, వెండి నాణ్యత విషయంలో కొనుగోలుదారులు మోసపోకుండా ఉంటుంది. నగల వ్యాపారుల మోసాలను అరికట్టేందుకు వినియోగదారుల మండలి ఇప్పటికే హనుమకొండలోని మూడు కార్పొరేట్ బంగారు ఆభరణాల షోరూంలపై వినియోగదారుల కమిషన్‌కు ఫిర్యాదు చేసింది.

రైలు ఢీకొని యువకుడి మృతి

నెక్కొండ, మే 19 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని రెడ్లవాడ గ్రామానికి చెందిన కర్నెకంటి మహేశ్ (19) రైలు ఢీ కొనడంతో మృతి చెందినట్లు రైల్వే పోలీసులు సోమవారం తెలిపారు. రెడ్లవాడ గ్రామానికి చెందిన అయిలయ్య, పద్మ దంపతుల కుమారుడు మహేశ్ తల్లిదండ్రులతో కలిసి హైదరాబాద్‌లో హౌస్ కీపింగ్ పనులు చేసుకుంటున్నాడు. మహేశ్ తాతయ్య యాదగిరి ఆనారోగ్యంతో ఈనెల 17న మృతి చెందగా 18న జరిగిన అంత్యక్రియల్లో పాల్గొన్న అనంతరం హైదరాబాద్ వెళుతున్నట్లు తల్లిదండ్రులకు చెప్పి నెక్కొండ రైల్వే స్టేషన్‌కు వచ్చాడు. రైల్వే స్టేషన్ సమీపంలో అప్‌లైన్‌పై వెళుతున్న గుర్తుతెలియని రైలు ఢీకొనడంతో తీవ్ర గాయాలకు గురైన మహేశ్ మృతి చెందినాడు, శవ పంచనామా జరిపి శవాన్ని తండ్రి అయిలయ్యకు అప్పగించారు. మృతుడు అవివాహితుడు.



మహేశ్(ఫైల్)



మీడియాతో మాట్లాడుతున్న శ్రీరామమూర్తి

ఎయిర్‌పోర్ట్ తరహాలో వరంగల్ రైల్వేస్టేషన్

ప్రారంభానికి సిద్ధం చేశాం

అసిస్టెంట్ కమర్షియల్ మేనేజర్ శ్రీరామమూర్తి

గిర్మాజిపేట, మే19 (ఆంధ్రజ్యోతి): అమృత్ భారత్ పథకం కింద వరంగల్ రైల్వేస్టేషన్‌ను రూ.25.41కోట్లతో ఎయిర్‌పోర్ట్ తరహాలో తీర్చిదిద్దామని, ఈనెల 22న ప్రధానమంత్రి నరేంద్రమోదీ దీన్ని వర్చువల్‌గా ప్రారంభిస్తారని, ఇందుకు అన్ని ఏర్పాట్లు చేశామని సికింద్రాబాద్ రైల్వే డివిజనల్ అసిస్టెంట్ కమర్షియల్ మేనేజర్ ఐ.శ్రీరామమూర్తి తెలిపారు. సోమవారం ఆయన వరంగల్ రైల్వేస్టేషన్‌లో ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో మాట్లాడారు. ఆసియాలో అతి పెద్ద ప్రజారవాణా వ్యవస్థగా సేవలందిస్తున్న భారతీయ రైల్వేశాఖను కేంద్ర ప్రభుత్వం అభివృద్ధి చేస్తోందని, రైళ్లు, రైల్వేస్టేషన్‌లు, రైలు మార్గాల అభివృద్ధి, విస్తరణ చేస్తోందని అన్నారు. ఇందులో భాగంగా వరంగల్ రైల్వేస్టేషన్‌ను కాకతీయ కళావైభవంతో రూపొందించామన్నారు. ఐదేళ్లలో వరంగల్ రైల్వేస్టేషన్‌ను రూ.45కోట్లతో అభివృద్ధి చేశామన్నారు. త్వరలో భద్రతా స్కానింగ్ యంత్రాలు, అధునాతన సీసీ కెమెరాలను కూడా ఏర్పాటు చేస్తామన్నారు. ఈ సమావేశంలో స్టేషన్ మేనేజర్ జె.సారయ్య, ఐఎడబ్లు శ్రీనివాస్, ఆర్‌పీఎఫ్ సీఐ పి.శ్రీనివాస్‌గౌడ్, చీఫ్ కమర్షియల్ ఇన్‌స్పెక్టర్ బి.రాజ్‌గోపాల్, చీఫ్ టికెట్ ఇన్‌స్పెక్టర్లు విజయ్ కుమార్, రాజేంద్రప్రసాద్, ఆరోగ్య అధికారి మధు తదితరులు పాల్గొన్నారు.

పీజీ పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి

కేయూ క్యాంపస్ మే 19, (ఆంధ్రజ్యోతి): కాకతీయ యూనివర్సిటీ పరిధిలో మే 20 నుంచి నిర్వహించే ఎంఎ, ఎంకామ్, ఎంఎస్సీతో పాటు ఇతర పీజీ కోర్సుల అఖరు సెమిస్టర్ పరీక్షలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు కేయూ పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ కట్ల రాజేందర్, అదనపు పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ బీఎస్‌ఎల్ సౌజన్యలు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పరీక్షలు కొనసాగుతాయని పేర్కొన్నారు. కేయూ పరిధిలోని ఉమ్మడి వరంగల్, ఖమ్మం, ఆదిలాబాద్ జిల్లాల్లో 4,300 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకానున్నట్లు వెల్లడించారు. వర్సిటీ పరిధిలో విద్యార్థులకు 26 పరీక్షల కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు అధికారులు వెల్లడించారు. పరీక్షలు 20, 22, 24, 27, 29, 31వ తేదీల్లో నిర్వహిస్తామని వెల్లడించారు.

వరంగల్‌లో క్రికెట్ స్టేడియం ఏర్పాటుకు సీఎం హామీ

- ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య
- సందడిగా అండర్-25 బాలురు క్రికెట్ లీగ్

వరంగల్ స్పోర్ట్స్, మే 19(ఆంధ్రజ్యోతి) : రంజీ, ఐపీఎల్ స్థాయి క్రికెట్ మ్యాచ్‌లు నిర్వహించే విధంగా నగరంలో అధునాతన క్రికెట్ స్టేడియం ఏర్పాటుకు సీఎం రేవంత్‌రెడ్డి హామీ ఇచ్చినట్లు ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య తెలిపారు. సోమవారం వరంగల్ జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రెడ్డిపురంలోని క్రికెట్ మైదానంలో ఏర్పాటు చేసిన అంతర్ జిల్లా అండర్-25 బాలుర క్రికెట్ లీగ్ పోటీలను ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వరంగల్ జిల్లా క్రికెట్ క్రీడాకారుల చిరకాల వాంఛ అయిన క్రికెట్ స్టేడియం ఏర్పాటు కోసం ఇటీవల ప్రభుత్వ ముఖ్య సలహాదారుడు వేం నరేందర్‌రెడ్డి, రెవెన్యూ శాఖ మంత్రి శ్రీనివాస్‌రెడ్డి, ఎమ్మెల్యేలు నాయిని రాజేందర్‌రెడ్డి, కేఆర్ నాగరాజు, రేవూరి ప్రకాష్‌రెడ్డి, కుడా చైర్మన్ ఇనగాల వెంకట్రామిరెడ్డిలను కలిశానన్నారు. దీంతో వరంగల్‌లో స్టేడియం గురించి వేం నరేందర్‌రెడ్డి సీఎం వద్ద ప్రస్తావించగా త్వరలోనే స్టేడియం ఏర్పాటుకు కృషి చేస్తానని మాట ఇచ్చారన్నారు. హైదరాబాద్ నగరం తరువాత పెద్ద నగరంగా అభివృద్ధి చెందుతున్న వరంగల్‌లో క్రికెట్ స్టేడియం తప్పకుండా ఉండాలని, స్టేడియం ఏర్పాటుకు తన సహాయ సహకారాలు ఉంటాయన్నారు.



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న బస్వరాజు సారయ్య

వరంగల్ జిల్లా క్రికెట్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి చాగంటి శ్రీనివాస్ మాట్లాడుతూ.. అంతర్ జిల్లా స్థాయి అండర్-25 బాలుర క్రికెట్ లీగ్ పోటీలు జూన్ 2వ తేదీ వరకు రెడ్డిపురం, మొగిచర్ల, వంగపల్లి క్రికెట్ మైదానాల్లో లీగ్ పద్ధతిన నిర్వహిస్తున్నామన్నారు. ఇక్కడ ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఆరు జట్ల అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన క్రీడాకారులను గుర్తించి జూన్ 2వ తేదీ నుంచి హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ (హెచ్‌సీఏ) ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో నిర్వహించనున్న టూ-డే క్రికెట్ లీగ్ పోటీలకు ఎంపిక చేస్తామన్నారు. కాగా, తొలిరోజు రెడ్డిపురం క్రికెట్ మైదానంలో హనుమకొండ - భూపాలపల్లి జట్ల మధ్య, మొగిలిచర్ల మైదానంలో జనగామ - ములుగు జట్ల మధ్య, వంగపల్లి మైదానంలో వరంగల్ - మహబూబాబాద్ జట్ల మధ్య పోటీలను నిర్వహించామన్నారు. ఈ కార్యక్రమంలో వరంగల్ జిల్లా క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షుడు పెద్ది ప్రవీణ్‌గౌడ్, సభ్యులు సదాశివ్, తోట రాము, ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.

తలంచి.. తరించి..

సముద్రాలలో ఘనంగా మహాకాళి విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవం ● పాల్గొన్న ఎంపీ కావ్య, ఎమ్మెల్యే శ్రీహరి

స్టేషన్‌ఘన్‌పూర్, మే 19 (ఆంధ్రజ్యోతి): జనగామ జిల్లా స్టేషన్‌ఘన్‌పూర్ మండలం సముద్రాలలో నూతన ఆలయంలో మహంకాళి అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవం సోమవారం కన్నులపండువగా జరిగింది. యాదాద్రి దేవాలయ విశ్రాంత ప్రధాన అర్చకుడు కారంపూడి నరసించార్యులు, బొర్రా హరికిషన్ శర్మల అర్చకుల బృందం ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహంకాళి జయజయధ్వానాలతో ఆలయ పరిసరాలు మార్మోగాయి. అర్చకులు మహంకాళి, పోచమ్మ అమ్మవారి ఆలయాల్లో ధ్వజస్తంభంల వద్ద ఏక కాలంలో యంత్రప్రతిష్ఠను నిర్వహించారు. భక్తులు పెద్ద ఎత్తున తరలి రావడంతో గ్రామంలో, ఆలయం వద్ద పండుగ వాతావరణం నెలకొంది.



మహంకాళి అమ్మవారి వద్ద జరిగిన హోమంలో పాల్గొన్న ఎంపీ, ఎమ్మెల్యే

పాల్గొన్న ఎమ్మెల్యే, ఎంపీ

వేడుకలకు ముఖ్యఅతిథులుగా ఎమ్మెల్యే కడియం శ్రీహరి, ఎంపీ కడియం కావ్యలు హాజరయ్యారు. ధర్మకర్త కుందూరు నాగమణి - సోమిరెడ్డిల ఆధ్వర్యంలో ఘనస్వాగతం పలికారు. వారు ప్రత్యేక పూజలు చేసి, హోమం. శివ-పార్వతుల కల్యాణోత్సవంలో పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ.. ఆలయ ధర్మకర్త నాగమణి-సోమిరెడ్డి దంపతులు లక్షలాది రూపాయలు వెచ్చించి రాతితో ఆలయంను నిర్మించడం అభినందనీయమన్నారు. ఈ ప్రాంత ప్రజలకు మెరుగైన విద్యుత్ అందించడానికి, నారాయణపురంలో 33/11 కేవీ సబ్‌స్టేషన్‌ను నిర్మిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ చైర్‌పర్సన్ జూలకుంట్ల లావణ్య-శిరీష్‌రెడ్డి, నాయకులు సీహెచ్ నరేందర్ రెడ్డి, ఇనుగాల వెంకటేశ్వర్ రెడ్డి, అంబటి కిషన్‌రాజ్, గన్ను నర్సింహులు, ఎన్. శ్రీరాములు, బాస్కుల కిరణ్, తాటికొండ కుమారస్వామి, వీరగోని రాజు, గుండె నర్సయ్య, బత్తుల బాలరాజు, ఇమ్మడి హరిప్రసాద్, దైద ఎలిషన్, పల్లె రవీందర్, మందపురం అనిల్, ఎన్. అజయ్ రెడ్డి, నారాయణ పాల్గొన్నారు.

ఉత్సవాలకు సైలానీబాబా ముస్తాబు



ఉత్సవాలకు ముస్తాబైన సైలానీబాబా దర్గా

- రేపటి నుంచి ప్రారంభం కానున్న గంధం ఉర్సు
- మూడు రోజుల పాటు వేడుకలు
- ఒగ్లాపూర్‌లోని దర్గా ఆవరణలో ఏర్పాట్లు పూర్తి


దామెర, మే 19 (ఆంధ్రజ్యోతి): హనుమకొండ జిల్లా దామెర మండలంలోని ఒగ్లాపూర్‌లోని సైలానీ బాబా దర్గా ప్రాంగణంలో 118వ హజ్రత్ సందల్ గంధం ఉత్సవాలకు నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. ఈ నెల 21(బుధవారం) నుంచి మూడు రోజుల పాటు సందల్ గంధం ఉర్సు ఉత్సవాలు జరుగనున్నాయి. దర్గా ప్రాంగణమంతా విద్యుత్ లైట్లతో ముస్తాబు చేశారు. దేశవ్యాప్తంగా వివిధ ప్రాంతాల నుంచి ఉత్సవాలకు వచ్చే భక్తులకు తాగు నీరు, వైద్యం, భోజనం, వసతి వంటి వివిధ సదుపాయాలను నిర్వాహకులు సిద్ధం చేశారు. అలాగే పలు ప్రాంతాల నుంచి పీఠాధిపతులు, ప్రముఖులతో పాటు లక్షలాదిగా భక్తులు హాజరు కానున్నారు. ఈ ఉత్సవాల్లో ప్రత్యేక ఆకర్షణగా మహారాష్ట్ర నుంచి ప్రముఖ బ్యాండ్ వాయిద్యం కళాకారులతో నగారా (వాయిద్యం) ఏర్పాటు చేస్తున్నారు. తెలంగాణ, ఏపీ రాష్ట్రాలతో పాటు ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్ర, బెంగళూరు, ఢిల్లీ, ముంబయి, చెన్నై, హైదరాబాద్, కరీంనగర్, ఖమ్మం తదితర ప్రాంతాల నుంచి లక్షలాదిగా భక్తులు గంధం వేడుకలకు హాజరవుతారు. హనుమకొండ, కరీంనగర్, హైదరాబాద్, ములుగు, భూపాలపల్లి, ఖమ్మం తదితర ప్రాంతాల నుంచి రానున్న భక్తులకు ఆర్టీసీ బస్సు సౌకర్యం ఏర్పాట్లు చేశారు. ఉత్సవాల్లో అవాంఛనీయ ఘటనలు జరుగకుండా పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేస్తున్నారు.

ఉర్సు గంధం ఉత్సవాలు

సైలానీ బాబా దర్గా ఆవరణలో ఈ నెల 21న ఒంటె మీద ఊరేగింపుగా గంధం తీసుకురావడంతో ఉర్సు జాతర ప్రారంభమవుతుంది. తర్వాత దర్గా పీఠాధిపతి అబ్దుల్ హమీద్ షామియా (సైలానీబాబా) సమక్షంలో ఛాదర్లు సమర్పిస్తారు. 22న రాత్రి 9 గంటలకు ప్రముఖుల ఆధ్వర్యంలో కవ్వాలీ కార్యక్రమం నిర్వహిస్తారు. 23న పీఠాధిపతి సైలానీ బాబా ఆధ్వర్యంలో తహలీల్ ఫాతెహా ప్రత్యేక ప్రార్థనలు నిర్వహిస్తారు.

గంధం ఉత్సవాలకు ఏర్పాట్లు పూర్తి చేశాం..

పీఠాధిపతి అబ్దుల్ హమీద్ షామియా



గంధం ఉత్సవాలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశాం. ఉమ్మడి వరంగల్ జిల్లాతో పాటు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్ర తదితర ప్రాంతాల నుంచి భక్తులు హాజరు కానున్నారు. భక్తులకు అన్ని సదుపాయాలు కల్పిస్తున్నాం. వైద్య, రెవెన్యూ, విద్యుత్, రవాణా తదితర శాఖల సహకారంతో జాతర విజయవంతం చేసేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశాం. అలాగే వాహనాల పార్కింగ్ కోసం దర్గా సమీపంలోని మూడు ప్రాంతాల్లో స్థలాలను కేటాయించాం. జాతరకు వచ్చే భక్తులకు మూడు రోజుల పాటు అన్నదానం చేయనున్నాం.



త్రివేణి సంగమంలో పుష్కర స్నానాలు ఆచరిస్తున్న భక్తులు

సంవిదానంద సరస్వతికి సరస్వతీ మాత విగ్రహాన్ని బహూకరిస్తున్న ఆలయాధికారులు



పుష్కర స్నానం.. పుణ్యఫలం..

కాళేశ్వర త్రివేణి సంగమానికి కొనసాగుతున్న భక్తుల రద్దీ

- ఐదో రోజున 60వేల మందికిపైగా వచ్చినట్టు అంచనా
- పుష్కరస్నానమాచరించిన కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ దంపతులు
- త్రయంబకేశ్వర్ స్వామిజీ సహా పలువురు వీఐపీల రాక
- ట్రాఫిక్ సమస్యకు చెక్‌పెడుతూ పోలీసుల చర్యలు

కాళేశ్వరం, మే 19 (ఆంధ్రజ్యోతి): పుష్కరస్నానం ఆచరిస్తే.. పుణ్యఫలం దక్కుతుందంటూ వేలాదిమంది భక్తులు.. సరస్వతీ నమోనమామి అంటూ పుష్కరాలకు తరలొస్తున్నారు. కాళేశ్వర క్షేత్రంలోని త్రివేణి సంగమంలో అంతర్వాహిని చెంత పలు రాష్ర్టాలకు చెందిన వేలాది భక్తులు పుణ్యస్నానాలాచరించి.. ముక్తీశ్వరుడిని దర్శించుకుని పునీతులవుతున్నారు. ఉదయం వచ్చి రాత్రి జరిగే సరస్వతీ నదీ హారతిచ్చే వరకు ఉండి ఆ మహాఘట్టాన్ని చూసి భక్తులు పరవశించిపోతున్నారు. ఐదో రోజైన సోమవారం కాస్త భక్తుల రద్దీ తగ్గినప్పటికీ మొత్తం 60వేల మందికి పైగా భక్తులు పుణ్యస్నానాలు ఆచరించారు. తెలంగాణ జిల్లాల నుంచే కాకుండా పక్క రాష్ర్టాలైన మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్, ఛత్తీ్‌సగఢ్ రాష్ర్టాల నుంచి సోమవారం భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. వీవీఐపీల తాకిడి పెరిగింది. కేంద్ర హోంశాఖ సహాయమంత్రి బండి సంజయ్ దంపతులు, నాసిక్ త్రయంబకేశ్వర్ పీఠాధిపతి శ్రీమహా మండలేశ్వర స్వామిజీ, హైకోర్టు జడ్జి నందిగొండ నర్సింగారావుదంపతులు, ప్రభుత్వ విప్, డోర్నకల్ ఎమ్మెల్యే రాంచంద్రనాయక్, వైరా ఎమ్మెల్యే రాందాస్‌నాయక్, దేవాదాయ, ధర్మాదాయ శాఖ కమిషనర్ వెంకట్రావు, మాజీ మంత్రి, మల్కాజిగిరి ఎమ్మెల్యే మల్లారెడ్డి, తదితరులు హాజరై పుణ్యస్నానాలు ఆచరించి ముక్తీశ్వర ఆలయంలో స్వామివారిని దర్శించుకున్నారు. వీరికి అర్చకులు వేదమంత్రాలతో ప్రత్యేక పూజలు నిర్వహించి ఆశీర్వచనాలు అందించారు.

ఐదో రోజు 60వేల మంది భక్తులు..

పుష్కరాలు ప్రారంభమై సోమవారానికి ఐదోరోజు కాగా.. సోమవారం శివుడికి ప్రీతికరమైన రోజు కావడంతో భక్తులు అధికంగా వస్తారని అధికారులు అంచనా వేశారు. కానీ అనుకున్న స్థాయిలో భక్తులు రాలేదు. తొలి నాలుగు రోజులతో పోలిస్తే రద్దీ తక్కువగా కనిపించింది. ఈ క్రమంలో నాలుగు రోజుల్లో తలెత్తిన సమస్యలు, ఇబ్బందులపై సమీక్షించుకున్న అధికార యంత్రాంగం ఇకపై అలా జరగకుండా చర్యలు చేపట్టారు. భక్తుల రద్దీ పెరుగుతుందన్న అంచనాలతో అధికారులు చలువపందిళ్లను మరికొన్నింటిని పెంచారు.

ట్రాఫిక్ క్రమబద్ధీకరణ ..

శని, ఆదివారాల్లో తలెత్తిన ట్రాఫిక్ సమస్య పునరావృతం కాకుండా అధికారులు ప్రత్యేక దృష్టి సారించారు. వాహనాల రాకపోకలను క్రమబద్ధీకరించారు. వారాంతమైన శని, ఆదివారాల్లో భక్తులు అధికంగా ఉండడం వల్లనో, ట్రాఫిక్ సమస్య తలెత్తడం మూలంగానో సోమవారం భక్తుల సంఖ్యపై ప్రభావం చూపిందని అధికారులు భావిస్తున్నారు. అయితే ఆదివారం ఉత్పన్నమైన సమస్యలను దృష్టిలోపెట్టుకుని జిల్లా యంత్రాంగం చర్యలు చేపట్టింది. ముఖ్యంగా ఆర్టీసీ, ప్రైవేటు వాహనాలను వేర్వేరు మార్గాల్లో నడిపించేందుకు కార్యాచరణ తయారుచేసింది. ఇందులో ఆర్టీసీ బస్సులను నేరుగా కాళేశ్వర క్షేత్రానికి వచ్చేలా చర్యలు తీసుకోవాలని నిర్ణయించగా ప్రైవేటు వాహనాలను అన్నారం క్రాస్ నుంచి చంద్రుపల్లి, పుస్కుపల్లి మార్గం మీదుగా మళ్లించాలని, లేదా, కాటారం, గంగార ం క్రాస్, దామెరకుంట మీదుగా కాళేశ్వరం వరకు వచ్చేలా చర్యలు తీసుకోవాలని నిర్ణయించినట్లు తెలిసింది. అయితే సోమవారం పెద్దగా జనం రాకపోవడంతో ప్రధానరహదారి గుండానే వాహనాల రాకపోకలను క్రమబద్ధీకరించారు.



ముక్తీశ్వరాలయంలో పూజలు చేస్తున్న బండి సంజయ్ దంపతులు



మహదేవుడి దర్శనం కోసం ముక్తీశ్వరాలయానికి వస్తున్న ఎమ్మెల్యే మల్లారెడ్డి



పుష్కర స్నానమాచరిస్తున్న హైకోర్టు జడ్జి నర్సింగరావు, కుటుంబసభ్యులు





పుష్కరాల్లో.. పుష్కల ఆదాయం..

ముక్తీశ్వరాలయానికి ఐదురోజుల్లో రూ.57.04లక్షలు రాక

కాళేశ్వరం, మే 19 (ఆంధ్రజ్యోతి): సరస్వతీ పుష్కరాల నేపథ్యంలో కాళేశ్వరంలోని శ్రీ ముక్తీశ్వరాలయానికి ఆదాయం పుష్కలంగా వచ్చింది. పుష్కరస్నానాలు చేసిన అనంతరం భక్తులు అధిక సంఖ్యంలో ముక్తీశ్వరుడిని దర్శించుకుంటున్నారు. ఈ క్రమంలో ప్రత్యేక దర్శనాల టికెట్లు, లడ్డూ, పులిహోర ప్రసాదాల విక్రయాల ద్వారా ఐదు రోజుల్లో దేవస్థానానికి రూ.57.04లక్షలు ఆదాయం వచ్చిందని అధికారులు తెలిపారు. పుష్కరాలు జరగడం ఇది తొలిసారే అయినా ఐదు రోజుల్లో ఆదాయం రూ.50లక్షలు దాటడం పట్ల సంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. తొలిరోజు పలుచగా వచ్చినా రూ.4.26లక్షలు వచ్చాయి. అలాగే రెండో రోజు 12.73లక్షలు, మూడో రోజు 11.97లక్షలు, నాలుగోరోజు 12.84లక్షలు, ఐదో రోజు రూ.15.22లక్షలు ఆదాయం వచ్చిందని వివరించారు. లడ్డూ పులిహోర తయారీలో నాణ్యత ప్రమాణాలు పాటిస్తున్నామని, భక్తులు సంతృప్తిగా కొనుగోలు చేస్తున్నారని, మిగిలిన వారం రోజుల్లో కోటికి పైగానే ఆదాయం సమకూరే అవకాశం ఉంటుందని తెలిపారు.

వైభవంగా నవరత్న హారతి

కాళేశ్వరం, మే 19(ఆంధ్రజ్యోతి): కాళేశ్వర త్రివేణి సంగమంలో సరస్వతీ పుష్కరాలను పురస్కరించుకుని సోమవారం రాత్రి 7.20గంటల నుంచి 8గంటల వరకు ఏడుగురు కాశీ పండితులు నవరత్న హారతిని వైభవంగా నిర్వహించారు. ఆధ్యాత్మిక సంగీత నేపథ్యంతో ఓంకార, నాగ, పంచ, సూర్య, చంద్ర, నంది, సింహ, కుంభ, నక్షత్ర హారతులతో కూడిన నవరత్న హారతిని పండితులు కన్నుల పండువగా త్రివేణి సంగమం అంతర్వాహిని సరస్వతి మాతకు నిర్వహించారు.




నదీహారతి వేడుకను ఫోన్లలో బంధిస్తున్న భక్తులు

సుమారు గంటపాటు నిర్వహించిన నవరత్న హారతి కార్యక్రమంలో ఐజీ తరుణ్‌జోషి, కలెక్టర్ రాహుల్ శర్మ, ఎస్పీ కిరణ్ ఖరే, దేవాదాయ శాఖ కమిషనర్ వెంకట్రావు, కాళేశ్వర-ముక్తీశ్వర ఆలయ అధికారులు పాల్గొన్నారు.

వీడియో కాల్స్‌తో హారతి దర్శనం..

పుష్కరాల్లో భాగంగా నిత్యం సాయంత్రం సాయంలో కాశీ పండితులతో వైభవంగా నిర్వహిస్తున్న నవరత్న హారతిని వందలాది మంది భక్తులు తమ ఫోన్లలో ఫొటోలు, వీడియోలు తీసుకుంటున్నారు. కొందరు భక్తులు వివిధ రాష్ర్టాలు, విదేశాల్లో ఉన్న తమ కుటుంబసభ్యులు, బంధువులు, స్నేహితులకు వీడియో కాల్ చేసి చూపుతున్నారు. అయితే సిగ్నళ్ల సమస్య తలెత్తుతుండటంతో చాలామంది వీడియోలు తీసుకుంటున్నారు.

పార్కింగ్‌లో ఉన్న వందలాది వాహనాలు



ఐదో రోజూ ఆలయంలో ప్రత్యేక హోమాలు

కాళేశ్వరం, మే 19(ఆంధ్రజ్యోతి) : సరస్వతీ పుష్కరాలను పురస్కరించుకుని ఐదోరోజు కాళేశ్వర ముక్తీశ్వరాలయంలో పలు హోమాలను నిర్వహించారు. సోమవారం సప్తమి కావడంతో ఉన్నత చదువులు, విదేశీ చదువుల కోసం మేధా దక్షిణామూర్తి హోమము, అపమృత్యు దోషాలు తొలగడానికి మహా అమృత మృత్యుంజయ హోమం నిర్వహించినట్లు అర్చకులు తెలిపారు. మంగళవారం మన్యుసూక్త, కాలభైరవ హోమాలు నిర్వహించనునట్లు అధికారులు తెలిపారు.





అర్ఘ్యం వదులుతున్న డోర్నకల్ ఎమ్మేల్యే, విప్ రాంచంద్రునాయక్, వైరా ఎమ్మెల్యే రాందాస్ నాయక్



ముక్తీశ్వరుడి దర్శనం కోసం బారులు తీరిన భక్తులు



హైదరాబాద్ కళాకారుల కూచిపూడి నృత్య ప్రదర్శన

అలరిస్తున్న సాంస్కృతిక కార్యక్రమాలు

కాళేశ్వరం, మే 19(ఆంధ్రజ్యోతి): పుష్కరాల్లో భాగంగా కాళేశ్వరం త్రివేణి సంగమ తీరంలో నిర్వహిస్తున్న సాంస్కృతిక కార్యక్రమాలు ఆహూతులను అలరిస్తున్నాయి. సోమవారం హైదరాబాద్‌కు చెందిన కూచిపూడి నృత్య కళాకారులు తమ ప్రదర్శనలతో అదరగొట్టగా.. అనంతరం నిర్వహించిన సంగీత విభావరి భక్తులను ఆకట్టుకుంది. నిత్యం కళాకారులు నిర్వహిస్తున్న వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను ఎంతగానో అలరిస్తున్నాయి.


అనుబంధ ఆలయాల్లో భక్తుల రద్దీ

కాళేశ్వరం, మే 19(ఆంధ్రజ్యోతి) : సరస్వతి నదిలో పుష్కర స్నానం అనంతరం భక్తులు కాళేశ్వర, ముక్తేశ్వర స్వామి దర్శించుకొని అనుబంధ దేవాలయాల్లోని స్వామివార్లను దర్శించుకోవడంతో ఆలయాల్లో రద్దీ కొనసాగుతుంది. స్వామి వారిని దర్శించుకున్న అనంతరం భక్తులు శుభానంద దేవి, ప్రౌఢ సరస్వతి, రామాలయం, ఆది ముక్తేశ్వర స్వామి దర్శించుకుంటున్నారు. స్వామి వారిని దర్శించుకున్న అనంతరం భక్తులు లడ్డు, ప్రసాదాలు తీసుకుంటున్నారు. దీంతో ఆలయాలు భక్తులతో కిటకిట లాడుతున్నాయి.

భక్తుల సేవలో పోలీసులు.. భద్రత విధుల్లో బలగాలు



దేవాలయంలో భక్తులకు వాటర్ బాటిల్స్ అందిస్తున్న పోలీసు అధకారి



కుడుర్పల్లే వద్ద అడవిలో ఏరియా డామినేషన్ చేస్తున్న బలగాలు

సరస్వతీ పుష్కరాల నేపథ్యంలో పోలీసు యంత్రాంగం పటిష్ఠ భద్రతా చర్యలు చేపట్టింది. ఓ వైపు వేలాదిగా తరలొస్తున్న భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పోలీసులు సేవల్లో నిమగ్నమైతే.. మరోవైపు వీఐపీల రాక నేపథ్యంలో వారి భద్రత దృష్ట్యా ప్రత్యేక బలగాలు పహారా కాస్తున్నాయి. పోలీసులు ఎర్రటి ఎండలో ట్రాఫిక్ నియంత్రణ కోసం కాళేశ్వరం వచ్చి పోయే రోడ్లలో విధులు నిర్వహిస్తున్నారు. మరికొందరు పుష్కరఘాట్‌లు, ముక్తీశ్వరాలయంలోని క్యూ లైన్ల వద్ద బందోబస్తులో నిమగ్నమయ్యారు. ఈ క్రమంలో కొందరు క్యూలైన్లలో ఉంటున్న భక్తుల దాహార్తి తీర్చేందుకు వాటర్ బాటిళ్లు అందజేస్తున్నారు. ఇక కర్రెగుట్టల్లో మావోయిస్టుల కదలికలు, ఎన్‌కౌంటర్ అలజడి నేపథ్యంలో పుష్కరాలకు వచ్చే వీఐపీల భద్రతను దృష్ట్యా ప్రత్యేక బలగాలు ఎర్రటి ఎండలో అడవిబాటలో నడుస్తూ ఏరియా డామినేషన్ నిర్వహిస్తున్నాయి.

- ఫొటోలు : 'ఆంధ్రజ్యోతి' స్టాఫ్ ఫొటోగ్రాఫర్, హనుమకొండ

అందుబాటులో 'ఆయుష్' సేవలు

కాళేశ్వరం, మే 19(ఆంధ్రజ్యోతి): కాళేశ్వరంలో జరగుతున్న సరస్వతి పుష్కరాలకు వచ్చే భక్తుల కోసం ప్రాచీన వైద్య పద్ధతులైన ఆయుర్వేదం, యునాని, హోమియోపతిలకు సంబంధించిన చికిత్సలు, మందులు అందుబాటులో ఉంచారు. కాళేశ్వరం పీహెచ్‌సీ ఆవరణలో ఆయుష్ విభాగం ఆధ్వర్యంలో ప్రత్యేక వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. హనుమకొండ జిల్లా ప్రోగ్రాం అధికారి డాక్టర్ భానుకుమార్ నేతృత్వంలో జిల్లా ఇన్‌చార్జ్ డాక్టర్ తనూజారాణి ఆధ్వర్యంలో పలువురు వైద్యులు, ఫార్మసిస్టులు, ఎంఎన్‌వోలు భక్తులకు ఈ వైద్య సేవలందిస్తున్నారు. పుష్కరాలు ప్రారంభమైన ఐదురోజుల్లో సుమారు 2,500మందికిపైగా జనరల్, దీర్ఘకాలిక వ్యాధిగ్రస్థులకు చికిత్సలు అందించి మందులు పంపిణీ చేసినట్లు వైద్యులు తెలిపారు.



వైద్యశిబిరంలో మందులు పంపిణీ చేస్తున్న వైద్యులు

నీట మునిగిన ఇద్దరిని కాపాడిన బలగాలు

కాళేశ్వరం, మే 19(ఆంధ్రజ్యోతి): పుష్కర స్నానం చేయడానికి వచ్చే భక్తులను నీటి ప్రమాదాల నుంచి కాపాడేందుకు నదీ తీ రంలో, పుష్కర ఘాట్లలో ప్రభుత్వం ఎస్డీ ఆర్‌ఎఫ్ బలగాలను మోహరించింది. ము లుగు జిల్లా చల్వాయి 5వ బెటాలియన్‌కు చెందిన 66మంది స్టేట్ డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్ (ఎస్‌డీఆర్‌ఎఫ్)కు చెందిన 22మంది సిబ్బంది పలు బృందాలుగా, షిఫ్టులవారీగా సరస్వతి పుష్కర ఘాట్‌తో పాటు ఇతర ఘాట్ల వద్ద విధులు నిర్వర్తిస్తున్నారు. రెండు రోజులుగా పుష్కర స్నానం చేస్తూ ఇద్దరు బాలురు నీటిలో మునిగిపోతుండగా.. వారిని రక్షించి తల్లిదండ్రులకు అప్పగించినట్లు ఎస్డీఆర్‌ఎఫ్ సిబ్బంది తెలిపారు.



త్రివేణి సంగమంలో ఎస్‌డీఆర్‌ఎఫ్ సిబ్బంది

విధులకు డుమ్మా కొట్టిన మెడికల్ ఆఫీసర్

డాక్టర్ లేక ఇబ్బంది పడుతున్న రోగులు

మొగుళ్లపల్లి, మే 19 (ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని పీహెచ్‌సీలో రెండో మెడికల్ ఆఫీసర్ నవత సోమవారం విధులకు హాజరుకాకపోవడంతో పలు గ్రామాల నుంచి చికిత్స నిమిత్తం వచ్చిన రోగులు, ప్రజలు తీవ్ర ఇబ్బందిపడ్డారు. కాళేశ్వరం సరస్వతీ పుష్కరాల సందర్భంగా ఈ నెల 15నుంచి విధుల నిమిత్తం మండల మెడికల్ ఆఫీసర్ నాగరాణి అక్కడికి వెళ్లారు. రెండో మెడికల్ ఆఫీసర్ నవత అందుబాటులో ఉండి మండల ప్రజలకు వైద్యసేవలం దించాల్సి ఉండగా విధులకు గైర్హాజరు కావడంతో పేద ప్రజలకు ప్రభుత్వ వైద్యం అందడంలేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. కాగా, గురువారం సదరు రెండో మెడికల్ ఆఫీసర్ సమయపాలన పాటించ కుండా ఉదయం 10గంటలకు వచ్చి రిజిష్టర్‌లో సంతకాలు చేసి గంటలో తిరిగి ఇంటికి వెళ్లిపోయినట్లు సమాచారం. శుక్రవారం, శనివారం తోపాటు సోమవారం కూడా విధులకు హాజరుకాక పోవడంతో డాక్టర్ ఎప్పుడు వస్తారో, ఎప్పుడు వెళ్తారో తెలియకపో వడంతో రోగులకు ఏం చెప్పాలో తెలియక సిబ్బంది సతమత మవుతున్నారు. ఈ నెల 15వతేదీ నుంచి విధులకు హాజరుకాకున్నా సబ్‌సెంటర్ల విజిట్‌కు వెళ్లినట్లు హాజరు రిజిష్టర్‌లో(టూర్) పెట్టాలని సిబ్బందికి సూచించినట్లు తెలిసింది. రెండేళ్లక్రితం విధుల్లో చేరినప్పటి నుంచి నవత విధులకు సరిగా హాజరుకావడంలేదనే ఆరోపణలు కూడా ఉన్నాయి. ఇప్పటికైనా సంబంధిత జిల్లా ఉన్నతాధికారులు స్పందించి విధులకు హాజరుకాని రెండో మెడికల్ ఆఫీసర్ నవతపై చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు కోరుతున్నారు.

రిజర్వు ఫారెస్టులో తునికాకు కోతలు

- అనధికారిక గ్రామాల్లో సేకరణ
- అధికారులు, కాంట్రాక్టర్లు కుమ్మక్కు
- వివరణ ఇవ్వడంలో అధికారుల నిర్లక్ష్యం

ఏటూరునాగారం, మే 19 (ఆంధ్రజ్యోతి): ములుగు జిల్లా ఏటూరునాగారం మండలం లోని దొడ్ల, మాల్యాల, కొండాయి, ఐలాపురం సౌత్ జోన్ పరిధి పరిసరాల్లోని రిజర్వు ఫారెస్టులో అటవీశాఖ అధికారులు, కల్లేదారులు, కాంట్రాక్టర్లు నియమ నిబంధనలకు నీళ్ల వదిలి తునికాకు కోతలు కొనసాగిస్తున్నట్లు ఆయా గ్రామాల ప్రజలు ఆరోపిస్తున్నారు. అధికారికంగా కల్లాలు లేకపోయినా, గత కొన్ని రోజులుగా కాంట్రాక్టర్లు తమ స్వార్థం కోసం అటవీశాఖ అధికారుల కనుసన్నలోనే పెద్ద ఎత్తున తునికాకును కోయిస్తున్నారు. ఇలా సేకరించిన తునికాకును రహస్య మార్గాల ద్వారా తరలించేందుకు ప్రయత్నాలు జరుగుతు న్నాయి. దీంతో, రిజర్వు ఫారెస్టులో ఆకు కోస్తున్న కూలీల పేర్లు అధికారిక జాబితాల్లో నమోదు కావడం లేదు. ఫలితంగా, వారు కూలీతో పాటు ప్రభుత్వ బోనస్‌ను కూడా కోల్పోయే ప్రమాదం ఏర్పడింది. ఈ అక్రమ దందాపై స్థానిక ప్రజలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రిజర్వు ఫారెస్టులో వెంటనే తునికాకు సేకరణను నిలిపివేయాలని వారు డిమాండ్ చేస్తున్నారు. అటవీశాఖ ఉన్నతాధికారులు వెంటనే స్పందించి, ఈ అక్రమ కార్యకలాపాలపై చర్యలు తీసుకోవాలని కూలీలు కోరుతున్నారు. అనధికారికంగా కొనసాగుతున్న తునికాకు సేకరణ బోనస్ నగదు కూలీలకు చెందకుండా సంబంధిత అధికారుల ఖాతాలోకి జమ అవుతున్నట్లు కూలీలు బోరుణ విలపిస్తున్నారు. గతంలో చేపట్టిన తునికాకు సేకరణ బోనస్ డబ్బులు కూడా కూలీలకు చెందకుండా రూ.లక్షలు స్వాహా చేయగా సదరు అధికారి అవినీతి బట్టబయలు కావడంతో సస్పెండ్ అయి కేసు నమోదు అయిన విషయం పాఠకులకు తెలిసిందే. ఈ విషయంపై అటవీశాఖ డివిజనల్ అధికారి, సౌత్ రేంజ్ అధికారులను వివరణ కోరేందుకు పలుమార్లు ఫోన్లు చేస్తే సమాధానం ఇవ్వలేదు.



కొండాయి కల్లంలో ఆరబెట్టిన తునికాకు కట్టలు

టీడీపీ మండల మాజీ అధ్యక్షుడి మృతి

ఏటూరునాగారం, మే 19 (ఆంధ్రజ్యోతి): ఏటూరునాగారం మండల మాజీ టీడీపీ మండల పార్టీ అధ్యక్షుడు, మండల కేంద్రంలోని ఓడవాడకు చెందిన బాస రాములు(55) అనారోగ్యంతో మృతి చెందాడు. ఆయన మృతి పట్ల టీడీపీ, బీఆర్ఎస్, కాంగ్రెస్ మండల పార్టీ నాయకులు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ విషయం తెలుసుకున్న బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు కాకులమర్రి లక్ష్మనర్సింహరావు(లక్ష్మణ్ బాబు) అంత్యక్రియల నిమిత్తం రూ. 10వేలు ఆర్థిక సహాయం అందించారు. దీంతో మండల నాయకుల ద్వారా మృతుడి కుటుంబ సభ్యులకు ఈ సహాయాన్ని అందజేశారు. అంతేకాకుండా కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు చిటమట రఘు ఆధ్వర్యంలో రూ. 7వేలు అందజేశారు.

పెండింగ్ మెస్ బిల్లులు విడుదల చేయాలి

ఏటూరునాగారం, మే 19 (ఆంధ్రజ్యోతి): ఆశ్రమ పాఠశాలలు, ఎస్టీ హాస్టళ్లలో పెండింగ్‌లో ఉన్న మెస్ బిల్లులను వెంటనే విడుదల చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు జాగటి రవితేజ, టి.ఎల్ రవి కోరారు. సోమవారం ఐటీడీఏ పీవో చిత్రా మిశ్రాకు ఎస్ఎఫ్ఐ నాయకులు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ నాయకులు మాట్లాడారు. ఈ వినతి ఇచ్చిన వారిలో ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు కోగిల బాలేశ్వర్, నర్సింగరావ పాల్గొన్నారు.

ఉపాధ్యాయులు శిక్షణను వినియోగించుకోవాలి

గోవిందరావుపేట, మే 19 (ఆంధ్రజ్యోతి): పాఠశాల విద్యాశాఖ ఆధ్వర్యంలో ఈనెల 20నుంచి నిర్వహించనున్న రెండో విడత శిక్షణను ఉపాధ్యాయులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా విద్యాశాఖ అధికారి పాణిని సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మండలంలోని చల్వాయి మోడల్‌స్కూల్‌లో తెలుగు, హిందీ, ఫిజికల్‌సైన్స్, ఫిజికల్ ఎడ్యుకేషన్, జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో బయోసైన్స్, గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులకు శిక్షణ కార్యక్రమం జరుగుతుందని అన్నారు. అదేవిధంగా ములుగు,వెంకటాపూర్, గోవిందరావుపేట, తాడ్వాయి మండలాల ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయులు, ఎల్ఎఫ్ఎల్ ప్రధానోపాధ్యాయులకు జవహర్‌నగర్ మోడల్‌స్కూల్‌లో, ఏటూరునాగారం, కన్నాయిగూడెం, వాజేడు, వెంకటాపురం, మంగపేట మండలాల ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయులు, ఎల్ఎఫ్ఎల్ ప్రధానోపాధ్యాయులకు ఏటూరునాగారం జడ్పీహెచ్ఎస్‌లో శిక్షణ తరగతులు నిర్వహి ంచడం జరుగుతుందని అన్నారు. ఉదయం 9.30గంటల నుంచి సాయంత్రం 5.30గంటల వరకు నిర్వహించే శిక్షణ తరగతులకు ఉపాధ్యాయులు తప్పకుండా హాజరుకావాలని, వారికి భోజన వసతి కల్పించబడుతుందని పేర్కొన్నారు.

తిరంగ యాత్రకు సంపూర్ణ మద్దతు

వెంకటాపూర్, మే 19, (ఆంధ్రజ్యోతి): ఆపరేషన్ సింధూర్ విజయవంతమైన సందర్భంగా మంగళవారం ములుగు జిల్లా కేంద్రంలో నిర్వహించే తిరంగా యాత్రకు వెంకటాపూర్ మండల బీజేపీ కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ భూక్య జవహర్‌లాల్ ఒక ప్రకటనలో తెలిపారు. బీజేపీ నాయకులతో పాటు అన్ని విభగాల నాయకులు త్రిరంగయాత్రలో పాల్గొనాలని కోరారు.

మంత్రిని విమర్శించడం సరికాదు..

మహాముత్తారం, మే19(ఆంధ్రజ్యోతి): మంత్రి శ్రీధర్‌బాబును విమర్శించే స్థాయి మండల బీజేపీ నాయకులకు లేదని కాంగ్రెస్ మండల యూత్ అధ్యక్షుడు జాటోత్ వంశీనాయక్ అన్నారు. సోమవారం ఆయన మాట్లాడుతూ నిమ్మగూడెం నుంచి కనుకునూర్ వరకు 2013లో మంత్రి శ్రీధర్‌బాబు వేసిన రోడ్డుపై ఇప్పుడు నిరసన వ్యక్తం చేయడం విడ్డూరంగా ఉన్నదని అన్నారు. అప్పటి నుంచి 12 ఏళ్లుగా ఆ రోడ్డును కనీసం మరమ్మతులు కూడ చేయించలేదని అన్నారు. కొద్ది రోజుల్లో రోడ్డును పునర్మించడానికి మంత్రి కృషి చేస్తున్నారని అన్నారు.

విద్యుదాఘాతంతో దుక్కిటెద్దు మృతి

మహాముత్తారం, మే19(ఆంధ్రజ్యోతి): మండలంలోని స్తంభంపల్లి(పీకే) గ్రామానికి చెందిన మానేటి శ్యాంకుమార్ అనే రైతుకు చెందిన ఎద్దు సోమవారం విద్యుదాఘాతంతో చెందింది. ఏఎస్సై ఆకుల మహేందర్ తెలిపిన వివరాల ప్రకారం సోమవారం ఉదయం శ్యాంకుమార్ పొలంలో ఎద్దు మృతి చెందిందని గ్రామానికి చెందిన ఓ వ్యక్తి తెలపడంతో బాధితుడు పొలంకు వెళ్లి చూడగా విద్యుత్ తీగ తగలి చనిపోయినట్లు గుర్తించి ఫిర్యాదు చేశాడని తెలిపారు. సంఘటన స్థలానికి వెళ్లి పరిశీలించగా బాధితుడి పొలం మీదుగా పందిపంపుల గ్రామానికి చెందిన దామెర సుదర్శన్, రమేష్‌లు వారి అవసరం కోసం విద్యుత్ తీగలను భూమిపై నుంచి తీసుకు వెళ్లారని, ఒక చోట తీగ తెగిపోయి ఉండడంతో షాక్‌తో ఎద్దు చనిపోయిందని తెలిపారు. బాధితుడి ఫిర్యాదు మేరకు ఇద్దరిపై కేసు నమోదు చేశామని ఏఎస్సై తెలిపారు.

మంత్రిని దూషించిన వ్యక్తిపై కేసు

మహాముత్తారం, మే19(ఆంధ్రజ్యోతి): మండలంలోని స్తంభంపల్లి(పీపీ) గ్రామానికి చెందిజ జంగిలి రాజేందర్(35) అనే వ్యక్తి ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబును, ఆయన తండ్రి దివంగత శ్రీపాదరావును వాట్సప్‌లో దూషిస్తు పోస్టు పెట్టిన కారణంగా పోలీసులు సోమవారం కేసు నమోదు చేశారు. ఈ విషయంలో అదే గ్రామానికి చెందిన కాంగ్రేస్ పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు జంగిలి రాజేష్ ఫిర్యాదు చేయడంతో సదరు వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఏఎస్సై ఆకుల మహేందర్ తెలిపారు.

నూతన ఎంఈవోగా రవీందర్‌రెడ్డి

మహాముత్తారం, మే19(ఆంధ్రజ్యోతి): మండల నూతన ఎంఈవోగా మందల రవీందర్‌రెడ్డి సోమవారం ఎమ్మార్సీ భవనంలో మాజీ ఎంఈవో పాసం సంజీవరెడ్డి నుంచి బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా రవీందర్‌రెడ్డి మాట్లాడుతూ మండలంలో ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి కృషి చేస్తానని, ఈ నెల 20వ తేది నుంచి ప్రారంభమయ్యే ఉపాధ్యాయుల శిక్షణ తరగతులను విజయవంతం చేయాలని ఆయన కోరారు. ఈ సందర్భంగా నూతన ఎంఈవోను ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించారు. ఉపాధ్యాయులు రవినాయక్, రవీందర్ నాయక్, రాజేంద్రప్రసాద్, ప్రకాష్, సుమలత, కృష్ణమోహన్ రెడ్డి పాల్గొన్నారు.

రోడ్డుకు అడ్డంగా కూలిన చెట్టు

వెంకటాపురం, మే 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బెస్తగూడెం గ్రామ సమీపంలోని ఆర్అండ్‌బీ రోడ్డుకు అడ్డంగా టేకు చెట్టు కూలిన సంఘటన సోమవారం జరిగింది. వివరాల్లోకి వెళితే...సాయంత్రం సమయంలో వచ్చిన గాలి దుమారానికి వెంకటాపురం నుంచి వాజేడు మండలం ఏడ్జర్లపల్లికి వెళ్లే ఆర్అండ్‌బీ రోడ్డుకు అడ్డంగా టేకు చెట్టు కూలడంతో వాహనదారులు ఇబ్బందిపడ్డారు. ఈవిషయం తెలుసుకున్న అటవీశాఖ అధికారులు సంఘటన ప్రాంతానికి చేరుకుని చెట్టును తొలగించి వాహన రాకపోకలను పునరుద్ధరించారు. కాగా, టేకు చెట్టును అటవీశాఖ కార్యాలయానికి తరలించినట్లు సెక్షన్ అధికారి దేవయ్య తెలిపారు. ఈ కార్యక్రమంలో బేస్‌క్యాంప్ సిబ్బంది పాల్గొన్నారు.

కాటారం డీఎస్పీ బదిలీ

కాటారం, మే 19(ఆంధ్రజ్యోతి): కాటారం డీఎస్పీ రాంమోహన్‌రెడ్డి బదిలి అయ్యారు. సోమవారం రాత్రి రాష్ట్ర వ్యాప్తంగా డీస్పీ బదిలీల్లో బాగంగా కాటారం డీఎస్పీగా గత రెండేళ్ల పని చేస్తున్న రాంమో హన్‌రెడ్డిని డీజీపీ కార్యాలయానికి అటాచ్ చేస్తూ ఉత్తర్వులు వెలువడ్డాయి. భూపాలపల్లి జిల్లా కేంద్రంలో డీసీఆర్‌బీ డీఎస్పీగా బి. నారయణను కాటారం డీఎస్పీగా బదిలీ చేశారు.

అందుబాటులో జీలుగ విత్తనాలు

వెంకటాపూర్, మే 19, (ఆంధ్రజ్యోతి): జీలుగ విత్తనాలు అందుబాటులో వచ్చాయి. వెంకటాపూర్ మండలానికి 100.2 క్వింటాళ్ళ విత్తనాలు వచ్చినట్లు ఏవో మాడూరి శైలజగౌడ్ తెలిపారు. వానాకాలం సీజన్‌లో సూమారు 20,806 లక్షల ఎకరాల్లో వివిధ రకాల పంటలు సాగు చేసే అవకాశం ఉందని అంచన వేసినట్లు ఆమే తెలిపారు. మండల వ్యాప్తంగా అత్యధికంగా వరి15,120 ఎకరాల్లో, పత్తిసాగు 4715 ఎకరాల్లో, మిర్చిసాగు 1180 ఎకరాల్లో సాగు చేయనున్నట్లు ఆమే పేర్కోన్నారు. మండలానికి 2వేళ క్వింటాళ్ళ జీలుగు విత్తనాలు అవసరమని, దానికి అనుగుణంగా వాటిని మండలానికి చేరవేశారని, మిగిత విత్తనాలు కూడ త్వరలోనే రానున్నట్లు తెలిపారు. బస్తాకు రూ. 2138 ఉంటుందన్నారు.

మహిళ మెడలో గొలుసు చోరీ

కాటారం, మే19(ఆంధ్రజ్యోతి):మండలంలోని రేగులగూడెం జీపీ పరిధిలోని దేవరాంపల్లిలో కామిడి లక్ష్మి అనే మహిళ మెడలో నుంచి గుర్తు తెలియని దుండగుడు చైన్ స్నాచింగ్‌కు పాల్పడ్డాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..లక్ష్మి, మల్లయ్య దంపతులిద్దరే ఇంట్లో ఉంటారు. ఆదివారం రాత్రి యథావిధిగా ఇంట్లో నిద్రపోయారు. సోమవారం తెల్లవారుజామున లక్ష్మి ఇంట్లో కరెంట్ లేకపోవడంతో తలుపు తీసుకుని బయటికి వచ్చింది. బయట కరెంట్ ఉన్నది చూసి అటుఇటు చూడగా వారింటికి వచ్చే మీటర్ వైర్ తెగిపడి ఉంది. వైర్‌ను పక్కన పడేసిన లక్ష్మి కాలకృత్యాలు తీర్చుకోవడానికి వెళ్లి బయటకు వస్తుండగా గుర్తు తెలియని దుండగుడు మెడలోని పుస్తెల తాడును తెంపుకుని పారిపోయాడు. దీంతో లబోదిబోమంటూ ఏడుస్తూ కేకలు వేయగా ఇంటి పక్కల వారు వచ్చి విషయం తెలుసుకుని అదే గ్రామంలో, గారెపల్లిలో ఉండే కుటుంబసభ్యులకు ఫోన్ లో సమాచారమిచ్చారు. మూడు తులాల పుస్తెల తాడును దుండగుడు తెంపుకుని వెళ్తుండగా అర తులం ఉండే పుస్తెలు కిందపడ్డాయి. లక్ష్మి మెడకు చైన్ తెగి కోసుకుంది. రెండున్నర తులాల బంగారు చైన్‌ను దుండగుడి చేతుల్లో చిక్కింది. కాగా దుండగుడు ప్లాన్ ప్రకారమే ఇంట్లో వృద్ధ దంపతులు మాత్రమే ఉండడం గమనించి కరెంట్ వైరును కట్ చేశాడు. కరెంట్ లేకుంటే ఉక్కపోతతో బయటకు వస్తారనే ఆలోచనతో ఈ ప్లాన్‌కు దిగినట్లు పలువురు భావిస్తున్నారు. చోరీకి గురైన చైన్ విలువ సుమారు రూ.2లక్షలుంటుందని బాధితురాలు ఆవేదన వ్యక్తం చేశారు.

హేమాచలక్షేత్రంలో భక్తుల సందడి

మంగపేట, మే 19 (ఆంధ్రజ్యోతి) మండలంలోని మల్లూరు హేమాచలకొండలపై వెలిసియున్న ఆదిలక్ష్మి చెంచులక్ష్మి సమేత లక్ష్మీనర్సింహస్వామిని సోమవారం సుమారు 15 వేల మంది భక్తులు దైవ దర్శనాలు చేసుకున్నారు. ఆలయ ప్రాంగణంలో చింతామణి జలధారల వద్ద పుణ్య స్నానాలు ఆచరించి ఉప దేవాలయాలల్లో దేవుళ్లను భక్తులు దర్శించుకొని తదనంతరం ఆదిలక్ష్మి చెంచులక్ష్మి అమ్మవార్లను దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో అర్చక ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

తప్పిపోయిన చిన్నారి అప్పగింత

కృష్ణకాలనీ, మే 19 (ఆంధ్రజ్యోతి): తప్పిపోయిన నాలుగేళ్ల చిన్నారిని తల్లి చెంతకు చేర్చారు ఓ బ్లూకోర్టు కానిస్టేబుల్. ఈ ఘటన భూపాలపల్లి జిల్లా కేంద్రంలో సోమవారం చోటు చేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రానికి రోషన్-నేహదంపతులు భూపాలపల్లి మండలం కుందూరుపల్లిలో నివాసముంటూ మేస్త్రీ పనిచేసుకుం టూ జీవనం సాగిస్తున్నారు. ఈ క్రమంలో రోజువారి పనిలో భాగంగా సోమవారం తమ నాలుగేళ్ల కుమార్తె హర్షికను వెంట తీసుకొని జిల్లా కేంద్రంలోని హైటెక్‌కాలనీకి పనికి వచ్చారు. పనిలో నిమగ్నమై ఉండగా వారి కుమార్తె హర్షిక ఆడుకుంటూ రోడ్డు దాటి బయటకు వెళ్లింది. కొద్దిసేపటికి తమ చిన్నారి లేని విషయాన్ని గమనించిన దంపతులు చుట్టు పక్కల వెతికారు. ఎక్కడా కనిపించలేదు. దీంతో డయల్ 100కు ఫోన్ చేయగా భూపాలపల్లి పోలీసులు వెంటనే స్పందించారు. బ్లూకోర్టు కానిస్టేబుల్ సుధీర్ ఘటనస్థలానికి వెళ్లి దంపతుల నుంచి వివరాలు తీసుకొని పట్టణంలోని కృష్ణకాలనీ, కారల్‌మార్క్స్ కాలనీ, జవహర్‌నగర్ కాలనీల్లో కలిగియ తిరిగాడు. దీంతో కోర్టు సమీపంలో పాపను గుర్తించి తల్లిదండ్రుల వద్దకు తీసుకెళ్లి క్షేమంగా అప్పగించాడు. పోలీసు సకాలంలో స్పందించి పాప ఆచూకీని కనిపెట్టడంతో ఊపిరిపీల్చుకొని సదరు కానిస్టేబుల్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

తాడిచర్ల కొనుగోలు కేంద్రంలో రైతుల నిరసన



కొనుగోలు కేంద్రం వద్ద నిరసన తెలుపుతున్న రైతులు

మల్హర్, మే 19(ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రమైన తాడిచర్ల కొనుగోలు కేంద్రంలో సోమ వారం వరి ధాన్యం కొనుగోలు చేపట్టడం లేదని నిరసనకు దిగారు. కొనుగోలు కేంద్రంలో వరి ధాన్యం పోసి రోజులు గడుస్తున్న కొనుగోల్లు చేపట్టడం లేదన్నారు. దీంతో చేసేది లేక రైతులు కొనుగోలు కేంద్రంలో పోసిన వరి ధాన్యాన్ని బయటకు తరలిస్తున్నారు. వారం రోజులుగా కొనుగోలు కేంద్రంలో వరి ధాన్యం తూకం చేయడం లేదని రైతులు ఆరోపిస్తున్నారు. కొనుగోళ్లు చేసిన రైతులకు ఇచ్చిన సీరియల్ ప్రకారం కాకుండా ఇష్టారీతిగా తూకం వేస్తున్నారని ఆరోపించారు. కొనుగోలు కేంద్రంలో పోసిన వరి ధాన్యం పశువుల పాలు అవుతుందని రైతులు ఆవేదన చెందుతున్నారు. సంబంధిత అధికారులు స్పందిం చి కొనుగోళ్లు చేపట్టేలా చూడాలని రైతులు కోరుతున్నారు.

రామప్పలోని శివాలయానికి మరమ్మతులు



ఐరన్ పైపులతో మరమ్మతులు చేపట్టిన పురావస్తుశాఖ అధికారులు

వెంకటాపూర్, మే 19, (ఆంధ్రజ్యోతి): సుప్రసిద్ధ యునెస్కో గుర్తింపు పొందిన రామప్ప దేవాలయానికి సమీపంలో ఉన్న 21 ఉపలాయాల్లో ఒక్కటైన యాకుబ్ సాబ్ (శివాలయం) గుడికి దాదాపు 10 రోజుల నుంచి మరమ్మతులు చేపడుతున్నామని అందులో బాగంగా సోమవారం నాటికి సపోర్టింగ్ పనులు పూర్తి అయ్యాయని పురవస్తుశాఖ జిల్లా అధికారి నవీన్ కుమార్ తెలిపారు. గత నాలుగేళ్ల కింద శివాలయం లోపలి భాగంలో ఎడమవైపు మొత్తం కూలిపోయిందని, ప్రస్తుతం కూడ కూలేందుకు సిద్ధంగా ఉన్న యాకూబ్‌సాబ్ (శివలయాన్ని పూర్తిగా పడిపోకుండా సపోర్టుగా ఐరన్‌పైపులతో ఏర్పాటు చేసి మరమ్మతులు చేపట్టినట్లు ఆయన తెలిపారు. ఉపాలయ రక్షణ కోసం ముందస్తు చర్యలు తీసుకుంటున్నట్లు ఆయన పేర్కొన్నారు.

కమలాపురంలో క్షుద్రపూజల కలకలం

మంగపేట, మే 19 (ఆంధ్రజ్యోతి) మండలంలోని కమలాపురం అంబేద్కర్ కాలని(ఎస్సీ కాలని) లో శనివారం రాత్రి నుంచి ఆదివారం వరకు క్షుద్రపూజల కలకలం జరిగింది. కాలనీవాసులు తెలిపిన ప్రకారం శనివారం అర్ధరాత్రి విద్యుత్ సరఫరా లేని సమయంలో ఇద్దరు గుర్తు తెలియని వ్యక్తులు చికెన్ సెంటర్ మూడు బజార్ల వద్ద క్షుద్ర పూజలు చేసే క్రమంలో అటువైపు ఇద్దరు వ్యక్తులు వస్తుంటే వారి రాకను గ్రహించి చీకట్లో పరుగులు తీశారు. దీంతో కాలనీలో క్షుద్రపూజల భయం కాలనీ వాసులకు పట్టింది. అయితే ప్రతి ఆదివారంతో పాటు అమావాస్య అర్ధరాత్రి వేళాల్లో క్షుద్రపూజ సామగ్రిని పెట్టి వెళ్లుతున్నారని కాలని వాసులు తెలిపారు. ఉన్నతాధికారులు ప్రత్యేక చొరవ తీసుకొని క్షుద్రపూజలు జరుగకుండా చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

నష్టపోయాం.. పరిహారం ఇప్పించాలి..



తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న రైతులు

వాజేడు, మే 19(ఆంధ్రజ్యోతి): ఒప్పంద వ్యవసాయం కింద వరి పంట వేసి నష్టపోయామని 18 మంది రైతులు ఆవే దన వ్యక్తం చేశారు. కంపెనీ నుంచి వచ్చే ఇన్సూ రెన్స్‌ను ఇప్పి ంచాలని తహసీల్దార్ ను, ఎంపీ డీవోను కలిసి రైతులు వినతి పత్రం అందించారు. మండలంలోని పూసూ రుకు చెందిన 18 మంది రైతులు ఓ కంపెనీకి చెందిన ఆడ మగ విత్తనాలను సాగు చేశారు. సంబంధిత కంపెనీ ఆర్గనైజరు ఎకరానికి రూ 42 పెట్టుబడి పెడతామని, ఆ పెట్టుబడి కూడా పూర్తిగా పెట్టకుండా మోసం చేశాడని, అదే విధంగా వరి పంట సుమారు 8 క్వింటాల్ దిగుబడి వస్తుందని లేకపోతే కంపెనీ నుంచి వచ్చే ఇన్సూరెన్స్‌ను ఇప్పిస్తానని చెప్పిన ఆర్గనైజర్ మాటలు నమ్మి సాగు చేస్తే సరైన దిగుబడి రాకపోవడంతో తాము నష్టపో యామని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. తమకు న్యాయం చేయాలని వేడుకున్నారు.

అంజన్న భక్తుల నగర సంకీర్తన

మంగపేట, మే 19 (ఆంధ్రజ్యోతి) హన్‌మాన్ మాలధారణ చేసుకున్న భక్తులు మండలంలోని కమలాపురం శ్రీ సీతారామాచంద్రస్వామి దేవాలయం నుంచి గ్రామంలో నగర సంకీర్తన(ఊరేగింపు)ను సోమవారం సాయంత్రం నిర్వహించారు. శ్రీరాముడు సీతా లక్ష్మణుడు హనుమాన్ విగ్రహాలతో శోభయాత్రను నిర్వహించారు. 80 మంది అంజన్న మాలధారణ చేసుకున్న భక్తులు అత్యంత భక్తిశ్రద్ధాలతో గ్రామంలోనొ శోభయాత్రను నిర్వహిస్తూ శ్రీరామ హనుమాన్ నామాలతో పాటలు పాడుతూ పుర వీధులు మారుమోగాయి. గ్రామంలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొన్నది. లింగంపల్లి శ్రీనివాసరావు, గురుస్వాములు నూకల రాజేష్, ప్రభాకర్, మోహన్‌లతో పాటు కన్ని స్వాములు, సీనియర్ జూనియర్ స్వాములతో పాటు బీజేపీ నాయకులు పాల్గోన్నారు.

సింహగర్జనను జయప్రదం చేయాలి

వెంకటాపూర్, మే 19, (ఆంధ్రజ్యోతి):ములుగు జిల్లా వెంకటాపూర్ మండలంలోని రామప్పలో జరిగే ముదిరాజుల సింహగర్జన, సన్నాహక సభను విజయవంతం చేయాలని మోపా వ్యవస్థాపక అధ్యక్షులు డాక్టర్ కొత్తగట్టు శ్రీనివాస్ పిలుపునిచ్చారు. సోమవారం రామప్పలో రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో రామలింగేశ్వరుడికి ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం రామప్ప చెరువుకట్టపై ముదిరాజుల సింహగర్జన పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈనెల 25న వెంకటాపూర్‌లో జరుగబోయే సభకు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని తెలిపారు.

తాత్కాలిక సెల్ టవర్ ఏర్పాటు

కాళేశ్వరం, మే19(ఆంధ్రజ్యోతి): గత ఐదు రోజులుగా విపరీతమైన భక్తుల రద్దితో స్థానికంగా ఉన్న సెల్ టవర్ల సిగ్నల్ అందగా భక్తుల ఫోన్లు పని చేయలేదు. దింతో స్పందించిన అధికారులు ఎయిర్ సంస్థతో మాట్లాడి సర్వసతి ఘాట్ వద్ద తాత్కాలిక సెల్ టవర్‌ను సోమవారం ఏర్పాటు చేయించారు. కొంత మేర కాళేశ్వరంలో ఫోన్ సిగ్నల్ సమస్య తీరింది.

ట్రాఫిక్ నియంత్రణకు చర్యలు

కాళేశ్వరం, మే 19(ఆంధ్రజ్యోతి) : గత రెండు రోజుల క్రితం ఎదురైన ట్రాఫిక్ కష్టాలను దృష్టిలో ఉంచుకొని అధికారులు నియంత్రణ చర్యలు చేపట్టారు. అన్నారం క్రాస్ వద్ద నుంచి కాళేశ్వరం వరకు సుమారు ఆరు కిలో మీటర్ల మేర ట్రాఫిక్ కోన్‌లను ఏర్పాటు చేశారు. రోడ్డుకు ఒక వైపు వెళ్లే విధంగా మరో వైపు వచ్చే ట్రాఫిక్ సేఫ్టి కోన్‌లను ఏర్పాటు చేశారు. ట్రాఫిక్ కష్టాలు తప్పడంపై భక్తులు ఆనందం వ్యక్తం చేశారు. వాహనాలు నిలవకుండా ఓవర్ టేక్ చేయకుండా కోన్‌లను ఏర్పాటు చేశారు.

బ్రహ్మకుమారీల ప్రచారం అడ్డగింత

కాళేశ్వరం, మే 19 (ఆంధ్రజ్యోతి): హిందు ధర్మ ప్రచారానికి వ్యతిరేకంగా ప్రవర్తిస్తున్నారని పేర్కొంటూ.. కొంతమంది హిందూ ధర్మ ప్రచారకర్తలు బ్రహ్మకుమారీలను ప్రశ్నించారు. వారి ఇద్దరి మధ్య కొంతసేపు మాటల పోరు సాగింది. ఈ సందర్భంగా హిందూ ధర్మకర్తలు మాట్లాడుతూ తెల్లదుస్తులు ఎవరు ధరిస్తారని, శంకరుడి గురించి ప్రచారం చేస్తూనే మరో కొత్త మతాన్ని సృష్టించేందుకు కుట్ర చేస్తున్నట్లు తమ వ్యవహారశైలి ఉందని నిలదీశారు. స్టాల్స్ పెట్టి డబ్బులు అడగండి కానీ ఇలా తప్పుడు ప్రచారం చేయవద్దని చెప్పారు. వెంటనే ఇక్కడి నుంచి స్టాల్స్‌ను తొలగించాలని డిమాండ్ చేశారు. అలాగే హిందువులకు వ్యతిరేకంగా ఉన్న ఓ ఫ్లెక్సీని చించివేశారు.

తిరంగా ర్యాలీని విజయవంతం చేయాలి

ఏటూరునాగారం, మే 19 (ఆంధ్రజ్యోతి): దేశభక్తిని చాటే విధంగా నేడు(మంగళవారం) ములుగులో తిరంగా ర్యాలీ నిర్వహించనున్నట్లు బీజేపీ మండల పార్టీ అధ్యక్షుడు వినుకొల్లు చక్రవర్తి తెలిపారు. ఈ ర్యాలీని విజయవంతం చేయాలని అన్ని పార్టీల నాయకులు, ప్రజలకు ఆయన పిలుపునిచ్చారు. సోమవారం మండల కేంద్రంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సమావేశంలో బీజేపీ పార్టీ గిరిజన మోర్చా జిల్లా అధ్యక్షుడు గండేపల్లి సత్యం, దళిత మోర్చా జిల్లా అధ్యక్షుడు వావిలాల జనార్ధన్, ఓబీసీ జిల్లా ప్రధాన కార్యదర్శి గడ్డం శ్రీధర్, మండల ఉపాధ్యక్షుడు యానాల చంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎంపీ ప్రొటోకాల్ అంశంపై అసత్య ఆరోపణలు



మాట్లాడుతున్న మాజీ ఎంపీపీ, నాయకులు

కాటారం/మల్హర్, మే 19(ఆంధ్రజ్యోతి):పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణకు సంబ ంధించి ప్రోటోకాల్ అంశంపై బీఆర్ఎస్ నేత పుట్ట మధు అసత్య ఆరోపణలు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని కాంగ్రెస్ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షు డు దండు రమేష్, కాటారం మాజీ ఎంపీపీ పంతకాని సమ్మయ్య, మల్హర్ మాజీ జడ్పీటీసీ కొండ రాజమ్మ, ఎస్సీ సెల్ నేతలు మంత్రి రాజసమ్మయ్య, భూపెల్లి రాజు అన్నారు. కాటారం, మల్హర్ మండల కేంద్రాల్లో వారు వేర్వేరుగా విలేకరులతో మాట్లాడారు. ఎంపీ వంశీకృష్ణ ఫోటోలను టెండర్ తీసుకున్న సంస్థలు ఫ్లెక్సీలలో ఏర్పాటు చేయకుంటే మధు వ్యాఖ్యలు చేయడం విడ్డూరంగా ఉందన్నారు. బీఆర్ఎస్ పాలనలో మాజీ జడ్పీ చైర్ పర్సన్ జక్కు శ్రీహర్షిణి ప్రోటోకాల్ విషయంలో ఎందుకు పట్టించుకోలేదని విమర్శించారు. ఈ సమావేశాల్లో నాయకులు ఆత్మకూరి కుమార్, కుమ్మరి అశోక్, బీరెల్లి మహేష్ తదితరులు పాల్గొన్నారు.


పుష్కరాల్లో విద్యుత్ శాఖ విస్తృత సేవలు

కాళేశ్వరం, మే 19(ఆంధ్రజ్యోతి): కాళేశ్వర క్షేత్రంలో సరస్వతీ పుష్కరాలు వైభవంగా జరుగుతున్న నేపథ్యంలో నిరంతరాయంగా విద్యుత్ సరఫరా చేసేలా ఆ శాఖ చర్యలు చేపట్టింది. ఇందుకోసం ప్రభుత్వం రూ.4కోట్లు కేటాయించగా.. ఎన్‌పీడీసీఎల్ సీఎండీ వరుణ్‌రెడ్డి, సీజీఎం(ఆపరేషన్స్)రాజీవ్ చౌహాన్ నేతృత్వంలో భూపాలపల్లి ఎస్ఈ మల్సూర్ నాయక్ ఆధ్వర్యంలో 300మంది వివిధ స్థాయిల అధికారులు, సిబ్బంది పుష్కరాల విధులు నిర్వహిస్తున్నారు. పలు జిల్లాలకు చెందిన ఐదుగురు డీఈఈలు, 15మంది ఏడీఈలు, 38మంది ఏఈలు, 27మంది సబ్ ఇంజనీర్లు, 220మందికి పైగా లైన్ ఇన్‌స్పెక్టర్లు, లైన్‌మెన్లు, జేఎల్ఎంలు, ఏఎల్ఎంలు, అన్‌మ్యాన్డ్ కార్మికులు విధుల్లో ఉన్నారు. షిఫ్టుల వారీగా విధులు నిర్వర్తిస్తుండగా ప్రతి షిఫ్ట్‌లో 130మంది అధికారులు, సిబ్బంది నిరంతరాయ విధులు చేపడుతున్నారని ఎస్ఈ తెలిపారు. కాళేశ్వరం సబ్‌స్టేషన్‌లో గతంలో ఉన్న 3.15ఎంవీఏ సామర్థ్యం గల రెండు పవర్ ట్రాన్స్‌ఫార్మర్ల స్థానంలో 5ఎంవీఏ సామర్థ్యంతో ఉండే రెండు పీటీఆర్‌లను ఏర్పాటు చేశామని ఎస్ఈ తెలిపారు. పుష్కరాల్లో ప్రధాన పుష్కర ఘాట్, తాత్కాలిక బస్టాండ్, టెంట్‌సిటీ, గోదావరి ఘాట్ తదితర ప్రాంతాల్లో 20కిపైగా ట్రాన్స్‌ఫార్మర్లు బిగించామన్నారు.

సుందరయ్య ఆశయ సాధన కోసం పోరాడాలి

గోవిందరావుపేట, మే 19 (ఆంధ్రజ్యోతి): కమ్యూనిస్టు యోధుడు, సిద్ధాంతకర్త పుచ్చలపల్లి సుందరయ్య ఆశయ సాధన కోసం ప్రతి ఒక్కరూ పోరాడాలని సీపీఎంపార్టీ మండల కార్యదర్శి సోమ మల్లారెడ్డి పిలుపునిచ్చారు. మండలంలోని పస్రాలో సోమవారం కడారి నాగరాజు అధ్యక్షతన సుందరయ్య 40వ వర్ధంతిసభ జరగగా మల్లారెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. దేశంలో సమసమాజ నిర్మాణం కోసం సుందరయ్య చూపిన మార్గంలో ప్రతీ కార్యకర్త నడుచుకోవాలన్నారు. తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటానికి నాయకత్వం వహించి 10లక్షల ఎకరాల భూమిని పేదలకు పంపిణీ చేసిన ఘనత ఆయనకే దక్కుతుందని కొనియాడారు. కుల వివక్షతకు వ్యతిరేకంగా పోరాడి కూలి రేట్లు పెంచాలని, రైతుల సమస్యల పరిష్కారం కోసం అఖిల భారత కిసాన్‌సభ ఏర్పాటు చేశారని అన్నారు. ధనిక కుటుంబంలో జన్మించిన సుందరయ్య యావత్ ఆస్తిని పేదలకు దానం చేసిన మహానుభావుడని అన్నారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు పొదిళ్ల చిట్టిబాబు, నాయకులు గొంది రాజేష్, అంబాల మురళి, క్యాతం సూర్యనారాయణ, మడకం రాజు, మంచాల కవిత, సువర్ణ పాల్గొన్నారు.

● వాజేడు : కమ్యూనిస్టు నాయకుడు పుచ్చలపల్లి సుందరయ్య అందరికి ఆదర్శ ప్రాయుడు అని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు, మండల కార్యదర్శి కొప్పుల రఘుపతిరావు అన్నారు. సోమవారం పుచ్చలపల్లి 40వ వర్ధంతిని మండలంలోని వాజేడు, ధర్మవరం, మురుమూరు గ్రామాలలో సీపీఎం శ్రేణులు నిర్వహించాయి. పుచ్చలపల్లి సుందరయ్య చిత్రపటంకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. గార సధాక్రిన్, బచ్చల కృష్ణబాబు, గుగ్గిళ్ల దేవయ్య, గౌరరాపు చంద్రశేఖర్, బలుసుపాటి సురేష్, కుర్సం నాగలక్ష్మీ, పూనెం కృష్ణబాబు, యశోద, తల్లడి ఉదయ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సోమ మల్లారెడ్డి